ప్రజాస్ఫూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
PS NEWS
మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 06-11-2025 | సంపుటి - 25 | సంచిక -171 | రూ : 4 | పేజీలు: 8

## బీజేపీలో బీఆర్ఎస్
# విలీనమయ్యే పరిస్థితి ఉంది
### ఈ విషయాన్ని కవిత చెప్పారు: రేవంత్ రెడ్డి



2లో

- బీఆర్ఎస్ పార్టీని కేసీఆర్ బీజేపీకి తాకట్టు పెట్టారని విమర్శ
- బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఒప్పందం ఉందన్న ముఖ్యమంత్రి
- జోడో యాత్ర ద్వారా రాహుల్ గాంధీ మైనారిటీలకు భరోసా ఇచ్చారని వెల్లడి

## విరాట్ కోహ్లీ
# 37వ పుట్టినరోజు..

- యువరాజ్ సింగ్, యుజ్వేంద్ర చాహల్ తదితరులు శుభాకాంక్షలు
- ఒకసారి రాజు అంటే ఎప్పటికీ రాజుగానే ఉంటాడంటూ యువరాజ్ ట్వీట్
- రాబోయే తరాలకు స్ఫూర్తిస్తూనే ఉంటాడని యుజ్వేంద్ర చాహల్ ట్వీట్



2లో

### ఢిల్లీ వాయు కాలుష్యం..
## భారత్‌కు సహాయం చేసేందుకు సిద్ధమన్న చైనా

- ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో 400 పాయింట్లు దాటిన గాలి నాణ్యత సూచి
- గాలి నాణ్యత దిశగా గణనీయ విజయాలు సాధించిన చైనా
- భారత్ సమస్య పరిష్కారానికి సహకరిస్తామని చైనా ఎంబసీ అధికార ప్రతినిధి ట్వీట్



2లో

## ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన
# మహిళా క్రికెట్ జట్టు

- జట్టు సభ్యులకు తన నివాసంలో ఆతిథ్యం ఇచ్చిన ప్రధానమంత్రి
- భారత జట్టు అద్భుతమైన పునరాగమనం చేసిందని ప్రశంస
- 'నమో' అని సంతకం చేసిన జెర్సీ ప్రధానికి బహూకరణ



2లో



2లో

## అంతరిక్షంలో ఏఐ డేటా సెంటర్లు..
# గూగుల్ సంచలన ప్రకటన!

- అంతరిక్షంలో ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటుకు గూగుల్ శ్రీకారం
- 'ప్రాజెక్ట్ సన్‌క్యాచర్' పేరుతో కొత్త పరిశోధన కార్యక్రమం
- సౌరశక్తితో పనిచేయనున్న టీపీయూ ఆధారిత శాటిలైట్లు
- 2027 నాటికి రెండు ప్రయోగాత్మక ఉపగ్రహాల ప్రయోగం
- ఏఐ భారీ విద్యుత్ అవసరాలకు ప్రత్యామ్నాయ మార్గం
- భూమిపై వనరుల భారాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యం

## తెలంగాణ సరిహద్దు సమీపంలో
# కాల్పుల మోత..

- ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్
- కూంబింగ్ ఆపరేషన్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి
- మృతదేహాలు, ఆయుధాలు స్వాధీనం చేసుకున్న బలగాలు
- జనవరి నుంచి ఇప్పటివరకు 477 మంది మావోయిస్టుల హతం
- ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని వెల్లడి



2లో

# విరాట్ కోహ్లీ 37వ పుట్టినరోజు... శుభాకాంక్షల వెల్లువ

ఢిల్లీ, నవంబర్ 05 : భారత బ్యాటింగ్ దిగ్గజం విరాట్ కోహ్లీ బుధవారం 37వ పుట్టినరోజు జరుపుకున్నాడు. ఈ సందర్భంగా అతడికి అభిమానులు, శ్రేయోభిలాషుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. 50 ఓవర్ల ఫార్మాట్‌పై దృష్టి పెట్టడానికి టెస్ట్‌లు, టీ20ల నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన కోహ్లీ, ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ మినహా దాదాపు ప్రతి ఐసీసీ టోర్నమెంట్‌ను గెలుచుకున్నాడు. మాజీ ఆల్ రౌండర్ యువరాజ్ సింగ్, స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ తదితరులు కోహ్లీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. "ఒకసారి రాజు, ఎల్లప్పుడూ రాజు. పుట్టినరోజు శుభాకాంక్షలు కోహ్లీ" అంటూ యువరాజ్ సింగ్ శుభాకాంక్షలు తెలియజేశాడు. రాబోయే సంవత్సరం మీకు మరింత గొప్పగా ఉండాలని కోరుకుంటున్నానని, ఆ దేవుడు ఆశీర్వదించాలని పేర్కొన్నాడు. రాబోయే తరాలకు మీరు స్ఫూర్తిని స్తూనే ఉంటారని, ఆ దేవుడి ఆశీర్వాదం మీపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటూ మీకు పుట్టినరోజు శుభాకాంక్షలు అని యుజ్వేంద్ర చాహల్ 'ఎక్స్' వేదికగా తెలియజేశాడు. కింగ్ కోహ్లీకి 37 ఏళ్లు నిండాయని, భారత క్రికెట్‌లో లెజెండ్ అని సురేశ్ రైనా పేర్కొన్నాడు. కోహ్లీ మరిన్ని రికార్డులు, విజయాలు సాధించాలని కోరుకుంటూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశాడు. ప్రపంచ క్రికెట్‌లో అతి పెద్ద ఛేజ్ మాస్టర్ కోహ్లీకి పుట్టినరోజు శుభాకాంక్షలు, నిజమైన భారతీయ హీరో అంటూ మహమ్మద్ కైఫ్ ట్వీట్ చేశాడు. బౌలర్లకు దడ పుట్టించే చిరునామా, అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన కోహ్లీకి పుట్టినరోజు శుభాకాంక్షలు అని సెహ్వాగ్ ట్వీట్ చేశాడు. నిత్య నూతనంగా, స్ఫూర్తిగా ఉండాలని కోరుకుంటున్నానంటూ కుల్దీప్ యాదవ్ శుభాకాంక్షలు తెలియజేశాడు. కోహ్లీ 123 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి 46.85 సగటుతో 9,230 పరుగులు చేశాడు. ఇందులో 30 సెంచరీలు, 31 అర్ధ సెంచరీలు ఉన్నాయి. అత్యుత్తమ స్కోరు 254 నాటౌట్. ఈ ఫార్మాట్‌లో టీమిండియా తరపున అత్యధిక పరుగులు చేసిన వారిలో కోహ్లీ నాలుగోవాడు. వన్డే క్రికెట్ చరిత్రలో 8,000, 9,000, 10,000, 11,000, 12,000, 13,000, 14,000 పరుగుల మైలురాళ్లను అత్యంత వేగంగా చేరుకున్న ఆటగాడిగా కోహ్లీ నిలిచాడు. కోహ్లీ టీ20లలో టీమిండియా తరపున అత్యంత నిలకడగా రాణించిన బ్యాట్స్‌మెన్‌లో ఒకడు. 125 మ్యాచ్‌ల్లో 48.69 సగటుతో 4,188 పరుగులు, 117 ఇన్నింగ్స్‌లలో ఒక సెంచరీ, 38 అర్ధ సెంచరీలు సహా 137 కంటే ఎక్కువ స్ట్రైక్ రేట్ కలిగి ఉన్నాడు. ప్రస్తుతం ఈ ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు సాధించిన వారిలో అతను మూడో స్థానంలో ఉన్నాడు.

## బీజేపీలో బీఆర్ఎస్ విలీనమయ్యే పరిస్థితి ఉంది.. ఈ విషయాన్ని కవిత చెప్పారు

హైదరాబాద్, నవంబర్ 05 : బీజేపీలో బీఆర్ఎస్ విలీనమయ్యే అవకాశం ఉందని, ఈ విషయాన్ని గతంలో కల్వకుంట్ల కవిత చెప్పారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీని కేసీఆర్ బీజేపీకి తాకట్టు పెట్టారని ఆయన విమర్శించారు. జూబ్లీహిల్స్‌లో మైనార్టీలను మభ్యపెట్టడానికి కుట్ర జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు బుధవారం ముఖ్యమంత్రిని కలిసి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత్ జోడో యాత్ర ద్వారా దేశంలోని మైనారిటీలకు రాహుల్ గాంధీ భరోసా ఇచ్చారని అన్నారు. కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగించి 3 నెలలైనా స్పందించలేదని విమర్శించారు. ఫార్ములా ఈకార్ రేసు కేసులో కేటీఆర్ అరెస్టుకు గవర్నర్ ఇంకా అనుమతి ఇవ్వలేదని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య ఒప్పందం లేకపోతే ఎందుకు అనుమతించడం లేదని ప్రశ్నించారు.

## ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన మహిళా క్రికెట్ జట్టు

వన్డే ప్రపంచ కప్ గెలిచిన భారత మహిళా క్రికెట్ జట్టు సభ్యులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బుధవారం సాయంత్రం తన నివాసంలో ఆతిథ్యమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన జట్టు సభ్యులను అభినందించారు. వరుసగా మూడు ఓటముల తర్వాత భారత జట్టు అద్భుతమైన పునరాగమనం చేసిందని ఆయన కొనియాడారు. మహిళా జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో పాటు జట్టు సభ్యులు సాయంత్రం ప్రధాని నివాసానికి చేరుకున్నారు. ప్రపంచ కప్ విశేషాలను ప్రధానితో పంచుకున్నారు. ఈ సందర్భంగా 'నమో' అని సంతకం చేసిన టీమిండియా జెర్సీని ప్రధానికి మహిళా జట్టు బహూకరించింది. 2017 ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత్ చివరి వరకు పోరాడి ఓడింది. నాడు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. అప్పుడు మిథాలీ రాజ్ నేతృత్వంలోని భారత జట్టు ప్రధానిని కలిసింది. ఈ విషయాన్ని మోదీ గుర్తు చేసుకున్నారు. అనంతరం మోదీకి ప్రపంచ కప్‌ను అందించారు.

## సింగపూర్ పర్యటనకు 78 మంది ఉత్తమ ఉపాధ్యాయులు

ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థలో సంస్కరణలను వేగవంతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. రాష్ట్రంలోని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతల్లో 78 మందిని అధునాతన విద్యావిధానాలపై అధ్యయనం కోసం సింగపూర్‌కు పంపనున్నట్లు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎంపిక చేసిన 78 మంది ఉపాధ్యాయులను ఈనెల 27వ తేదీన సింగపూర్ పంపేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. నవంబర్ 27 నుంచి డిసెంబర్ 2 వరకు వారం రోజుల పాటు ఈ బృందం సింగపూర్‌లోని ప్రముఖ పాఠశాలలను సందర్శిస్తుంది. అక్కడి బోధనా పద్ధతులు, తరగతి గదుల్లో ఉపయోగిస్తున్న ఆధునిక సాంకేతికత, పాఠశాల వాతావరణం వంటి అంశాలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. పర్యటన ముగిసిన తర్వాత, రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఒక నివేదిక సమర్పించాలని కోరారు.

**డిసెంబర్ 5న మెగా పీటీఎం**

గత ఏడాది తరహాలోనే ఈసారి కూడా డిసెంబర్ 5న రాష్ట్రవ్యాప్తంగా మెగా పేరెంట్ టీచర్ మీట్ (పీటీఎం)ను ఒక పండుగ వాతావరణంలో నిర్వహించాలని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులను కూడా భాగస్వాములను చేయాలని సూచించారు. విద్యార్థుల ప్రతిభ, పనితీరును తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా రూపొందించిన 'లీప్' యాప్‌పై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు.

### ఆర్సీబీని అమ్మేస్తున్నారు...
## ఐపీఎల్ లో కీలక పరిణామం

ఐపీఎల్‌లో అత్యంత ప్రజాదరణ కలిగిన జట్లలో ఒకటైన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) అమ్మకానికి రానుంది. ఈ ఫ్రాంచైజీ యజమాని, ప్రముఖ ఆల్కహాల్ బేవరేజ్ సంస్థ యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ (యూఎస్ఎల్) ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. తమ ప్రధాన వ్యాపారంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించే వ్యూహంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమర్పించిన ఫైలింగ్‌లో పేర్కొంది. ఆర్సీబీ జట్టును నిర్వహిస్తున్న రాయల్ ఛాలెంజర్స్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఆర్సీఎస్‌పీఎల్), యూఎస్ఎల్‌కు పూర్తిస్థాయి అనుబంధ సంస్థగా ఉంది. ఈ పెట్టుబడిపై వ్యూహాత్మక సమీక్ష చేపడుతున్నట్లు యూఎస్ఎల్ తెలిపింది. దీని ప్రకారం, 2026 మార్చి 31 నాటికి ఈ అమ్మకం ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టం చేసింది. ఈ నిర్ణయం పురుషుల ఐపీఎల్ జట్టుతో పాటు, మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) జట్టుకు కూడా వర్తిస్తుంది. ఈ పరిణామంపై యునైటెడ్ స్పిరిట్స్ ఎండీ, సీఈఓ ప్రవీణ్ సోమేశ్వర్ మాట్లాడుతూ, "యూఎస్ఎల్‌కు ఆర్సీఎస్‌పీఎల్ ఒక విలువైన ఆస్తి. అయితే, మా ప్రధాన వ్యాపారమైన ఆల్కహాల్ బేవరేజెస్ పరిశ్రమకు ఇది సంబంధం లేనిది. వాటాదారులందరికీ దీర్ఘకాలిక ప్రయోజనాలు అందించేందుకు మా పోర్ట్‌ఫోలియోను సమీక్షించుకుంటున్నాం. ఇందులో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నాం. ఆర్సీబీ ప్రయోజనాలను కూడా దృష్టిలో ఉంచుకుంటాం" అని వివరించారు. యూఎస్ఎల్ మాతృసంస్థ డయాజియో ఈ అమ్మకం ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించినట్లు తెలుస్తోంది. అమ్మకం ప్రక్రియకు ఒక నిర్దిష్ట గడువును ప్రకటించడం చూస్తుంటే, ఇప్పటికే కొనుగోలుదారులతో చర్చలు తుది దశకు చేరుకొని ఉండవచ్చని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

### ఢిల్లీ వాయు కాలుష్యం...
## భారత్‌కు సహాయం చేసేందుకు సిద్ధమన్న చైనా

ఢిల్లీ, నవంబర్ 05 : ఢిల్లీలో గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి పడిపోయిన నేపథ్యంలో సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని చైనా ప్రకటించింది. ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతాలు తీవ్రమైన వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ) గణాంకాల ప్రకారం చాలా ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచి 400 మార్కును దాటింది. గాలి నాణ్యతను మెరుగుపరచడంలో చైనా గణనీయమైన విజయాలు సాధించిందని, ఈ విషయంలో భారత్‌కు సహకరించడానికి తాము సిద్ధంగా ఉన్నామని భారత్‌లోని చైనా ఎంబసీ అధికార ప్రతినిధి యూజింగ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటనలో తెలిపారు. ఒకప్పుడు తమ దేశం కూడా తీవ్రమైన పొగమంచుతో ఇబ్బంది పడిందని, అలాంటి సమస్యలను ఎదుర్కొంటున్న వారితో తమ అనుభవాలను పంచుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని యూజింగ్ పేర్కొన్నారు. భారత్ త్వరలోనే ఈ పరిస్థితి నుంచి బయటపడుతుందని ఆశిస్తున్నామని ఆయన అన్నారు. గతంలో పొగమంచుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న చైనా, గాలి నాణ్యతను మెరుగుపరుచుకోవడంలో అద్భుతమైన ఫలితాలు సాధించింది. ఒకప్పుడు బీజింగ్‌తో పాటు పలు చైనా నగరాలు, పారిశ్రామిక కేంద్రాల్లో కాలుష్యం తీవ్రంగా ఉండేది. దీనిని గుర్తించినా చైనా ప్రభుత్వం కఠినమైన నియంత్రణ చర్యలు చేపట్టింది. గాలి నాణ్యత ప్రమాణాలను నిర్దేశించి వాటిని తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకుంది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినమైన జరిమానాలు విధించడంతో పాటు శిక్షలు కూడా అమలు చేసింది. ఫలితంగా గాలి నాణ్యత గణనీయంగా మెరుగుపడింది. కాలుష్యాన్ని తగ్గించే క్రమంలో చైనా వేగంగా పునరుత్పాదక ఇంధన వనరుల వైపు మళ్లింది. విద్యుత్ వాహనాలు, పవన, సౌర విద్యుత్ ఉత్పత్తిపై భారీగా పెట్టుబడులు పెట్టింది. వాయు కాలుష్యం తీవ్రంగా ఉన్న సమయాల్లో కాలుష్య కారక కర్మాగారాలను తాత్కాలికంగా మూసివేయడంతో పాటు కొన్ని కర్మాగారాలను పట్టణాలు, నగరాలకు దూరంగా తరలించింది. ఈ చర్యల ద్వారా పట్టణ ప్రాంతాల్లో గాలి నాణ్యత మెరుగుపడింది. ఢిల్లీతో సహా భారత్‌లోని నగరాల్లో కూడా చైనా తరహా కఠిన చర్యలు తీసుకుంటే పరిస్థితి మెరుగుపడుతుందని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు.

### అంతరిక్షంలో ఏఐ డేటా సెంటర్లు..
## గూగుల్ సంచలన ప్రకటన!

ఢిల్లీ, నవంబర్ 05 : టెక్నాలజీ దిగ్గజం గూగుల్ మరో భారీ ప్రయోగానికి తెరతీసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోసం ఏకంగా అంతరిక్షంలోనే డేటా సెంటర్లను నిర్మించేందుకు పరిశోధనలు ప్రారంభించినట్లు సంచలన ప్రకటన చేసింది. 'ప్రాజెక్ట్ సన్‌క్యాచర్' పేరుతో ఈ 'మూన్‌షాట్' కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించింది. భవిష్యత్తులో ఏఐ కంప్యూటింగ్ సామర్థ్యాన్ని విస్తరించడంలో ఈ ప్రాజెక్ట్ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టనుందని కంపెనీ భావిస్తోంది. ఈ ప్రాజెక్టులో భాగంగా, గూగుల్ తన టెన్సర్ ప్రాసెసింగ్ యూనిట్స్ (టీపీయూ)లను అంతరిక్షంలోకి పంపనుంది. సౌరశక్తితో పనిచేసే చిన్నపాటి ఉపగ్రహాల సమూహాన్ని ఏర్పాటు చేసి, వాటి ద్వారా ఏఐ డేటా సెంటర్లను నడపాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఉపగ్రహాలను ఒకదానికొకటి ఫ్రీ స్పేస్ ఆప్టికల్ లింక్స్ ద్వారా అనుసంధానిస్తారు. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ అంతరిక్షంలో భారీ డేటా సెంటర్లు రానున్నాయని అంచనా వేసిన కొన్ని వారాలకే గూగుల్ నుంచి ఈ ప్రకటన రావడం గమనార్హం. ఈ సందర్భంగా గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ మాట్లాడుతూ.. "మా టీపీయూలు అంతరిక్షంలోకి వెళ్తున్నాయి. క్వాంటం కంప్యూటింగ్, అటానమస్ డ్రైవింగ్ లాంటి మా మూన్‌షాట్ ప్రాజెక్టుల స్ఫూర్తితో 'ప్రాజెక్ట్ సన్‌క్యాచర్'ను ప్రారంభించాం. సౌరశక్తిని పూర్తిస్థాయిలో వినియోగించుకుని అంతరిక్షంలో ఏఐ వ్యవస్థలను ఎలా నిర్మించవచ్చో అన్వేషిస్తున్నాం" అని తెలిపారు. 2027 ప్రారంభం నాటికి ప్లానెట్ సంస్థ భాగస్వామ్యంతో రెండు ప్రయోగాత్మక ఉపగ్రహాలను ప్రయోగించడమే తమ తదుపరి లక్ష్యమని ఆయన వివరించారు.

**అంతరిక్షంలోనే ఎందుకు?**

ఏఐ అల్గారిథమ్‌లకు అపారమైన విద్యుత్ శక్తి అవసరం. భూమిపై ఈ విద్యుత్ అవసరాలు పర్యావరణంపై భారం మోపుతున్నాయి. దీనికి పరిష్కారంగా గూగుల్ అంతరిక్షాన్ని ఎంచుకుంది. భూమి మీద కంటే అంతరిక్షంలోని సరైన కక్ష్యలో ఉండే సోలార్ ప్యానెల్ 8 రెట్లు ఎక్కువ సామర్థ్యంతో పనిచేస్తుంది. దాదాపు నిరంతరాయంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయగలదు. బ్యాటరీల అవసరం కూడా తగ్గుతుంది. భూమిపై వనరుల వినియోగాన్ని తగ్గించి, ఏఐ పూర్తి సామర్థ్యాన్ని వాడుకోవాలంటే అంతరిక్షమే సరైన ప్రదేశమని గూగుల్ తన ప్రకటనలో పేర్కొంది. అయితే, ఈ ప్రాజెక్టులో రేడియేషన్, థర్మల్ మేనేజ్‌మెంట్, సిస్టమ్ విశ్వసనీయత వంటి అనేక సాంకేతిక సవాళ్లు ఉన్నాయి. ఇప్పటికే తమ ట్రిలియం జనరేషన్ టీపీయూలు భూమికి సమీప కక్ష్యలోని రేడియేషన్‌ను తట్టుకోగలవని ప్రయోగాల్లో తేలినట్లు గూగుల్ తెలిపింది. ఈ సవాళ్లను అధిగమించి, భవిష్యత్తులో అంతరిక్ష ఆధారిత ఏఐ మౌలిక సదుపాయాలను నిర్మించే దిశగా గూగుల్ తన పరిశోధనలను ముమ్మరం చేస్తోంది.

## తెలంగాణ సరిహద్దు సమీపంలో కాల్పుల మోత... ముగ్గురు మావోయిస్టుల మృతి

ఛత్తీస్‌గఢ్, నవంబర్ 05 : ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఏరివేత ఆపరేషన్ ముమ్మరంగా సాగుతోంది. బీజాపూర్ జిల్లాలోని దట్టమైన అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య బుధవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మరణించినట్లు సమాచారం. తెలంగాణ సరిహద్దుకు సమీపంలోని తార్లగూడ ప్రాంతంలో ఈ ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. వివరాల్లోకి వెళితే... అన్నారం, మరిమల్ల గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలపై నిఘా వర్గాల నుంచి పక్కా సమాచారం అందింది. దీంతో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) బృందాలు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతా బలగాలకు మావోయిస్టులు తారసపడటంతో ఇరువర్గాల మధ్య కాల్పులు మొదలయ్యాయి. ఈ ఆపరేషన్‌లో ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను, కొన్ని ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. అయితే, దీనిపై అధికారికంగా పూర్తి ప్రకటన వెలువడాల్సి ఉంది. బుధవారం సాయంత్రం నాటికి కూడా ఆపరేషన్ కొనసాగుతూనే ఉందని అధికారులు వెల్లడించారు. "బీజాపూర్ ప్రాంతంలో ఆపరేషన్ కొనసాగుతోంది, పరిస్థితి సాధారణంగానే ఉంది. ఆపరేషన్‌కు సంబంధించిన కీలక వివరాలను తగిన సమయంలో అందిస్తాం" అని మధ్యాహ్నం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఘటనపై స్పందిస్తూ, హతమైన మావోయిస్టులు అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పనిచేస్తున్న స్థానిక కమిటీలకు చెందినవారై ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

**ముమ్మరంగా కూంబింగ్**

2026 మార్చి నాటికి దేశం నుంచి మావోయిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇటీవలే ప్రకటించిన నేపథ్యంలో భద్రతా బలగాలు ఆపరేషన్లను తీవ్రతరం చేశాయి. ఛత్తీస్‌గఢ్‌లో 2024 జనవరిలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు 2,100 మంది మావోయిస్టులు లొంగిపోగా, 1,785 మందిని అరెస్ట్ చేశారు. వివిధ ఆపరేషన్లలో 477 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఒకవైపు సైనిక చర్యలు కొనసాగిస్తూనే, మరోవైపు 'ఆత్మసమర్పణ్ ఏవం పునర్వాస్ నీతి 2025', 'నియాద్ నెల్ల నార్ యోజన' వంటి పథకాల ద్వారా లొంగిపోయిన వారికి పునరావాసం కల్పిస్తూ ప్రభుత్వం ద్వంద్వ వ్యూహాన్ని అమలు చేస్తోంది.

## రేవంత్ రెడ్డికి మేమెందుకు భయపడతాం!: కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 05 : తాను ఎలాంటి తప్పు చేయలేదని, అలాంటప్పుడు రేవంత్ రెడ్డి లాంటి వ్యక్తికి ఎందుకు భయపడతానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డి ఉన్నది 3 ఫీట్లే అని, కానీ 30 ఫీట్లు ఉన్నట్లుగా డైలాగులు కొడతాడని విమర్శించారు. ఆయన ఏదో పేమెంట్ కోటాలో ముఖ్యమంత్రి అయ్యాడని ఆరోపించారు. రేవంత్ రెడ్డి తనను తాను అంతకంటే ఎక్కువగా ఊహించుకోవద్దని సూచించారు. తమపై పెట్టే ఉత్తి కేసులు నిలబడవని అన్నారు.

*** ఎన్నికలకు ఇక్కడి నుంచే డబ్బులు వెళుతున్నాయి**

కాంగ్రెస్ పార్టీ జాతీయస్థాయిలో పోటీ చేసే అన్ని ఎన్నికలకు డబ్బులు తెలంగాణ రాష్ట్రం నుంచే వెళుతున్నాయని కేటీఆర్ ఆరోపించారు. ఈ విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా అంగీకరించారని తెలిపారు. ఈ మేరకు ఆయన సాక్షి టీవీ ఛానల్ ముఖాముఖిలో మాట్లాడుతూ, ఇంత జరుగుతుంటే అమిత్ షా ఏం చేస్తున్నారని నిలదీశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి డబ్బులు లేవని చెబుతున్నారని విమర్శించారు. రైతు బంధు, పెన్షన్ పెంపుకు, తులం బంగారం ఇవ్వడానికి డబ్బులు లేవని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారని, కానీ ఢిల్లీకి మాత్రం వేల కోట్ల రూపాయలు పంపిస్తున్నారని ఆరోపించారు.

# విద్యార్థి అమరవీరుల సంస్మరణ సభలు నిర్వహించాలి

* **ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం**



ప్రజా స్ఫూర్తి, ఇల్లందు:నవంబర్ 5 నుండి 11 వరకు విద్యార్థి అమరవీరుల సంస్మరణ సభలు నిర్వహించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యూ) రాష్ట్ర కార్యవర్గ పిలుపులో భాగంగా ప్రగతిశీల విద్యార్థి ఉద్యమానికి తోడ్పాటు అందించిన మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నీలం రామచంద్రయ్య, ప్రగతిశీల విద్యార్థి ఉద్యమ నిర్మాత జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ లు అమరత్వం పొందిన ఇల్లందు మండలం, బొజ్జాయిగూడెం గ్రామ శివారు ( ప్రస్తుతం కొత్తగూడెం ఇల్లందు ప్రధాన రహదారి ) నా, వారు అమరత్వం పొంది 50 సంవత్సరాలు సందర్భంగా వారికి విప్లవ జోహార్లు అర్పిస్తూ పి.డి.ఎస్.యూ బిగి పిడికిలి జెండాను పి.డి.ఎస్.యూ జిల్లా అధ్యక్షుడు వి విజయ్ ఎగురవేసారు. జిల్లా కార్యదర్శి జె గణేష్ వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. శాస్త్రీయ విద్యాసాధన కోసం, సమ సమాజ స్థాపన కోసం నక్సల్బరీ, శ్రీకాకుళం, గోదావరి లోయ పోరాటాల ప్రేరణతో ఉస్మానియా అరుణతార కా... జార్జిరెడ్డి అందించిన ప్రగతిశీల విద్యార్థి ఉద్యమాన్ని కొనసాగింపుగా ప్రగతిశీల విద్యార్థి ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్త విస్తరణ చేసి నిర్మాణ రూపాన్ని తెచ్చిన ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి కా..జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, ఉద్యమ నిర్మాణానికి ఉపాధ్యాయ మ్యాజీ ఎమ్మెల్సీ నీలం రామచంద్రయ్య ఎంతో తోడ్పాటును అందించారు. ఉద్యమాలతో రాష్ట్రవ్యాప్తంగా పేద విద్యార్థులకు అండగా నిలిచి విద్యార్థులను ఎంతో చైతన్యపరిచి ముందుకు సాగుతున్న క్రమంలో ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ కాలంలో నాటి పోలీసులు జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ ను నీలం రామచంద్రయ్యలను విజయవాడలో పట్టుకొని హత్య చేసి నాటి చీకటి గండ్ల ప్రాంతమైన ఇక్కడే వారి భౌతిక కాయాలను వదిలేసారు అని, వారు అమరత్వం పొంది 50 సంవత్సరాలు పూర్తయిన నేటికీ వారి పోరాట స్ఫూర్తి విద్యార్థులను చైతన్య పరుస్తుందని అన్నారు. నూతన విద్యా విధానం పేరుతో విద్యకు మతం రంగును పులమాలని చూస్తున్నారు. కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలను పెంచి పోషించి విద్యను వ్యాపారీకరణ చేసి పేదవానికి నేడు విద్యను అందరిని ద్రాక్షగా మార్చారు. సెంట్రల్ యూనివర్సిటీలలో మతోన్మాద శక్తులను పెంచి పోషిస్తున్నారు రాష్ట్ర యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తున్నారు ప్రైవేటు యూనివర్సిటీలను తీసుకువచ్చి ఉన్నత విద్యను పేదవానికి మరింత దూరాన్ని చేస్తున్నారు. ఈ క్రమంలోనే అందరికీ ఉచిత, సమాన, నాణ్యమైన విద్య కొరకు ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అసమానతలు లేని సమాజ నిర్మాణం కొరకు శాస్త్రీయ విద్య సాధన ధ్యేయంగా, సమ సమాజ లక్ష్యంతో ముందుకు సాగాలని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు బి.చందు, సాయికుమార్, అరుణ్, సంతోష్, గణేష్, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ వందేళ్ల ఉత్సావాలకు శ్రమజీవుల విరాళం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: డిసెంబర్ 26న ఖమ్మం నగరంలో సిపిఐ శతవసంతల ముగింపు సందర్భంగా జరిగే బహిరంగ సభ, ఉత్సావాల జయప్రదం కోసం అన్నివర్గాల నుంచి సంపూర్ణ సహకారం అందుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్‌పాషా తెలిపారు. ఉత్సావాల జయప్రదానికి తాము సైతం అంటూ పట్టణంలోని పెద్ద బజార్ హమాలీ వర్కర్స్ యూనియన్ సభ్యులు తమ శ్రమఫలితం నుంచి కూడబెట్టిన రూ.1,00,116 లను బుధవారం కార్మిక అడ్డాలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషాకు అందించారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ కార్మికులు, శ్రామికులు, కర్షకులు, పేదవర్గాల జెండా ఎర్ర జెండానేని, వందేళ్లుగా ఎర్ర జెండాను మోస్తూ తమ సమస్యల పరిస్కారంకోసం అలుపెరగని పోరాటాలు చేస్తున్నారన్నారు. శ్రామికుల ఎర్ర జెండాను మరింత ఎరుపెక్కించి బలమైన ఉద్యమాలు నిర్మించడం ద్వారా ప్రజావ్యతిరేక పాలకుల మెడలు వంచాలని పిలుపునిచ్చారు. సిపిఐ వందేళ్ల ఉత్సావాల సందర్భంగా ఖమ్మంలో ఐదు లక్షల మందితో జరిగే బహిరంగ సభ, ఉత్సావాలను సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు కదలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, కార్యదర్శి గెడ్డాడు నగేష్, మాజీ కౌన్సిలర్ సత్యనారాయణాచారి, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు పోరెడ్డి శ్రీనివాసరెడ్డి, తరాల రాజు, నీలం మొగలి, వెలిశాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ గురుకుల విద్యార్థులకు పీఈటీ ప్రోత్సాహం

* **తండ్రి పేరు మీద క్రీడాకారులకు టీషర్టుల పంపిణీ**



అందోలు,ప్రజాస్ఫూర్తి: క్రీడాకారులు క్రీడల్లో మంచి ప్రతిభను కనబరిచేందుకు ప్రోత్సాహకంగా తన తండ్రి పేరు మీద తాను పనిచేస్తున్న మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన 19 మంది విద్యార్థులకు స్వంత ఖర్చులతో టీషర్టులను బుధవారం జోగిపేట క్రీడామైదానంలో అందజేసారు. సెప్టెంబర్ 9వ తేదిన అందోలు మండల స్థాయిలో జరిగిన పోటీల్లో గురుకుల పాఠశాలకు చెందిన 27 మంది విద్యార్థులు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో మంచి ప్రతిభను కనబరిచారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించే క్రీడలకు ఎంపిక కావడంతో వారిని ప్రోత్సహించేందుకు టీషర్టులను అందజేసినట్లు పీఈటీ అశోక్ తెలిపారు. జిల్లా స్థాయిలో ఈనెల 11వ తేదిన జిల్లా స్థాయి క్రీడా పోటీలు జరగనున్నాయని ఆయన తెలిపారు. ఈ క్రీడల్లో కూడా తమ పాఠశాలకు చెందిన క్రీడాకారులు గెలుపొంది పాఠశాలకు పేరు తీసుకువస్తారని అయన ఆశాభావాన్ని వ్యక్తం చేసారు.

## కన్ సాన్ పల్లి లో అయ్యప్ప స్వాములకు బిక్ష..



అందోలు, ప్రజాస్ఫూర్తి: అందోలు మండలంలోని కన్ సాన్ పల్లి గ్రామంలో ఈశ్వరాలయం సన్నిధానంలో బుధవారం ఐకేపి వివోఏ ఆంజనేయులు ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు బిక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించి అయ్యప్ప స్వాములకు స్వయంగా వడ్డించారు. గురు స్వాములు ఆనంద్ శర్మ స్వామి, ప్రకాశం స్వామి, కన్య స్వాములు నాగభూషణం, రాజు, హరికృష్ణ గౌడ్, స్వాములు మాణిక్యం స్వామి, అభిలాష్ స్వామి, కళ్యాణ్ స్వామి, చంద్రయ్య స్వామి, విష్ణు స్వామిలకు బిక్ష వడ్డీంచారు.అందోలు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఆకుల రాంబాబు, సభ్యులు గడ్డమిది సంతోష్, రాజు, శ్రీశైలం, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణ ముదిరాజ్ లు పాల్గొని ఆలయంలో స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



# దళారులకు విక్రయించి మోసపోవద్దు..

* **కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి...**
* **యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్...**

అందోలు, ప్రజాస్ఫూర్తి : ఆరుగాలం కష్టపడి ధాన్యం పండించి విక్రయించే సమయంలో దళారులను ఆశ్రయించి మోసపోవద్దని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. బుధవారం అందోలు మండలం లోని కన్ సాన్ పల్లి గ్రామంలో పిఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా, రైతును రాజుగా చేసే విధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలుచేస్తుందన్నారు. ధాన్యం క్వింటాల్కు ఏగ్రేడ్ రకానికి రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 మద్దతు ధరను అందిస్తుందని సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. ప్రతి గింజ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఎవరు కూడా ఆందోళన చెందవద్దని అన్నారు. రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. రైతుల సంక్షేమం, అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం తగు ప్రణాళికతో ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమములో మాజీ ఎంపీటీసీ బాలయ్య, పిఎసిఎస్ సీఈవో నర్సింలు, కొనుగోలు కేంద్ర సిబ్బంది పాపయ్య, నాయకులు బేగరి జాను, రామన్నగారి నర్సింలు, ప్రదీప్ రెడ్డి, రైతులు దర్శనం, సాయిలు, అర్జున్, శంకరయ్య, మల్లేశం తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# సీఎం సహాయ నిధి పేదల పెన్నిధి

- **యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్**

అందోలు, ప్రజాస్ఫూర్తి: సీఎం సహాయ నిధి పేదల పెన్నిధి అని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ అన్నారు. బుధవారం అందోలు మండల పరిధిలోని డాకూర్ గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివరాజ్ తో కలిసి ఆయా గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి కొండంత అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి ఉపయోగపడుతుందన్నారు. వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభ్యున్నతికి కృషి చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వైద్యా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా కనివిని ఎరుగని రీతిలో తన వద్దకు వచ్చిన దరఖాస్తులను వెంట వేంటనే సీఎం సహాయనిధికి పంపిస్తూ.. లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా త్వరితగతిన డబ్బులు వచ్చే విధంగా ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మంత్రికి లాబ్ధిదారుల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బాలయ్య, నాయకులు మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మల్లేశం తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



ప్రజా స్ఫూర్తి, ఇల్లందు: తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ గత కొద్దిరోజుల క్రితం స్వర్గస్తులయ్యారు. బుధవారం ఇల్లందు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు , ఇంచార్జ్ బానోత్ హరిప్రియ నాయక్, ఇల్లందు నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి పార్టీ శ్రేణులతో కలిసి హైదరాబాదులోని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు స్వగృహానికి విచ్చేసి వారిని పరామర్శించి. హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. పరామర్శించిన వారిలో తెలంగాణ ఉద్యమ నాయకులు సిలివేరి సత్యనారాయణ, లకావత్ దేవి లాలు నాయక్,ఇల్లందు నియోజకవర్గ సోషల్ మీడియా , యువజన నాయకులు గిన్నారపు రాజేష్, కొంటూ రవికాంత్, గుడిబండ్ల శ్యామ్, వార రమేష్, భుఖ్య సురేష్, ఇంతియాజ్ , షేక్ చాంద్ పాషా, తదితరులు పాల్గొన్నారు

## నేడు సీనియర్స్ రెజ్లింగ్ జిల్లా జట్టు ఎంపికలు

చర్ప, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా అమేచూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని ప్రగతి మైదానం గ్రౌండ్ నందు గురువారం సీనియర్స్ రెజ్లింగ్ జిల్లా జట్టును ఎంపిక చేసేందుకు ఎంపికపోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కాశీ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన క్రీడాకారులు తెలంగాణ ఒరిజినల్ ఆధార్ కార్డుతో ఉదయం 10 గంటలకు గ్రౌండ్ నందు హాజరుకావాలని సూచించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 8, 9 తేదీలలో హైదరాబాదులో జరగనున్న రాష్ట్రస్థాయి రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొనవలసి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9949761181 నెంబర్‌ను సంప్రదించవలసిందిగా కోరారు.

## గోదావరి నది తీరంలో కార్తీక పౌర్ణమి శోభ



ప్రజా స్ఫూర్తి,భద్రాచలం: కార్తీక మాస పౌర్ణమి సందర్భంగా భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం అనుబంధ ఆలయం శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో బుధవారం గోదావరి నదికి ప్రత్యేక పూజలు, నది హారతి ఘనంగా నిర్వహించారు.భక్తులతో కళకళలాడిన గోదావరి తీరంలో సాయంత్రం సమయంలో దీపాల వెలుగులు పరచి భక్తులు ఆరాధనలో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొని గోదావరి మాతకు ఘనంగా హారతి సమర్పించారు.

# చిల్లాపురం శ్రీ రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న ఈ ఎల్ వి ఫౌండేషన్ చైర్మన్

సంస్థాన్ నారాయణపురం, ప్రజాస్ఫూర్తి: సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని చిల్లాపురం శ్రీ రామలింగేశ్వర స్వామి జాతరలో ఈఎల్ వీ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఎల్ వీ భాస్కర్ మాట్లాడుతూ కార్తీకమాసం సందర్భంగా భక్తులకు శుభాకాంక్షలు తెలియజేశారు. చిల్లాపురం జాతరకు తరలి వస్తున్న భక్తుల కొరకై హెల్త్ క్యాంప్,మంచి నీటి సదుపాయాలు కలుగజేశారు. భవిష్యత్ లో ఆలయ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలను అందజేస్తానన్నారు. భక్తులకి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈ ఎల్ వి ఫౌండేషన్ సభ్యులు, అభిమానులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



# వైరా ఎమ్మెల్యేను కలిసిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బంజారా సంఘాల జేఏసీ

*** తుల్జా భవాని జాతర ఏర్పాటుకు స్థలం, నిధులు కేటాయించాలని వినతి**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్, శ్రీశ్రీశ్రీ తుల్జా భవాని జాతర ఏర్పాటుకు చేయుట గురించి కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, తెలంగాణ అటవీ శాఖ బోర్డు సభ్యులు, వైరా నియోజకవర్గ శాసన సభ్యులు మాళోత్ రాందాస్ నాయక్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బంజారా సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ శంకర్ నాయక్, వైస్ చైర్మన్ బానోత్ వీరు నాయక్‌ల ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాకు చెందిన బంజారా ఉపాధ్యాయ, ఉద్యోగ, సాధులు, బంజారా సంఘాల నాయకులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు సుమారు 50 మందికిపైగా హైదరాబాద్‌కు తరలి వెళ్లి రాందాస్‌నాయక్‌ను కలిశారు. ఈ సందర్భంగా బంజారా సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సుమారు 4 లక్షలకు పైగా బంజారా జనాభా ఉన్నారని పేర్కొన్నారు. గతంలో జిల్లా కేంద్రంలోని రేగళ్ల ప్రాంతంలో కొంత స్థలాన్ని ప్రభుత్వం కేటాయించినప్పటికీ అనివార్య కారణాల వల్ల ఆలయ నిర్మాణం జరగలేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి త్వరితగతిన అన్ని అనుమతులతో స్థలం కేటాయించడంతోపాటు జాతర నిర్వహణకు అవసరమైన నిధులు, సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జేఏసీ నాయకులు మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్‌ను కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బంజారాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను విన్నవించారు. శ్రీశ్రీశ్రీ తుల్జా భవాని జాతర ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగదంబసేన వ్యవస్థాపక అధ్యక్షులు తేజావత్ రాములు, సాధుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నూనావత్ శంకర్, బిచ్చ సాధు, వస్రాం సాధు, బంజారా భవన్ పాల్వంచ కమిటీ నాయకులు భూక్య చందు, బానోత్ రాము, జిల్లా జేఏసీ నాయకులు ధరావత్ కాన్షీరాం, బానోత్ రమేష్, డాక్టర్ వెంకట్, జాటోత్ భరత్, టిఎస్‌టిటిఎఫ్ ఉపాధ్యాయ సంఘ జిల్లా అధ్యక్షులు బి.మోహన్, సపావత్ బాలకృష్ణ, జర్పుల బిక్కులాల్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు మాళోత్ శివ నాయక్, ధరావత్ కృష్ణ, ఎల్‌హెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు గుగులోత్ కేశవ్ నాయక్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి గుగులోత్ మోహన్ నాయక్, చంద్రుగొండ మండల అధ్యక్షులు భూక్య రాందాస్ రాథోడ్, జిల్లా నాయకులు బానోత్ చందర్ నాయక్, ఏజెన్సీ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బానోత్ లాల్‌సింగ్ నాయక్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు గుగులోత్ భద్రు నాయక్, భారతీయ గోర్‌బంజారా ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు బానోత్ దుర్గా ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బోడ గణేష్, గుగులోత్ కోటి, బానోత్ రాము, జర్నలిస్టు సంఘాల నాయకులు బానోత్ నాగేశ్వరరావు, బానోత్ రమేష్, బానోత్ రాందాస్, ధరావత్ వెంకన్న, బీఆర్ఎస్ నాయకులు మూడ్ జయరాం నాయక్, బీజేపీ లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షులు మాళోత్ గాంధీనాయక్, సీపీఐ నాయకులు మాళోత్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నవరం సత్యనారాయణ స్వామి సన్నిధిలో

## ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య దంపతులు



ప్రజా స్ఫూర్తి, ఇల్లందు: ఆంధ్ర ప్రదేశ్ కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం సత్యనారాయణ స్వామి సన్నిధిలో ఇల్లందు ఎమ్మెల్యే దంపతులు కోరం కనకయ్య, లక్ష్మి వారితో పాటు మడుగు సాంబమూర్తి, బొల్లా సూర్యం,చిల్లా శ్రీనివాస్, గందె సదానందం, చిట్టి బాబు. కార్తీక పౌర్ణమి సందర్భంగా సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు, అనంతరం గర్భాలయంలో ఉన్న స్వామి వారిని వారంతా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు

## భద్రాచలంలో వైభవంగా జ్వాలాతోరణం



ప్రజా స్ఫూర్తి, భద్రాచలం: కార్తీక పౌర్ణమి సందర్భంగా భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం రాత్రి జ్వాలాతోరణ మహోత్సవం భక్తి శ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, దీపారాధనలు నిర్వహించగా, జ్వాలా తోరణం సమయంలో "జై శ్రీరామ్" నినాదాలతో పరిసరాలు మార్మోగాయి.

## దమ్మాయిగూడ అణుశక్తి నగర్ వాటర్ ట్యాంక్ రోడ్ మూసివేతతో

*** సిద్దార్థ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు**



దమ్మాయిగూడ, ప్రజాస్ఫూర్తి: దమ్మాయిగూడ అణుశక్తి నగర్ వాటర్ ట్యాంక్ నుండి సిద్దార్థ కాలనీకి వచ్చే ప్రధాన రహదారిని కొందరు వ్యక్తులు అక్రమంగా మూసివేయడం వల్ల కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కాలనీకి నేరుగా వచ్చే దారి మూసుకుపోవడం వల్ల ప్రజలు వందల మీటర్లు అదనంగా తిరిగి మెయిన్ రోడ్ ద్వారా మాత్రమే రాకపోకలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సిద్దార్థ కాలనీ వాసులు మాట్లాడుతూ, పిల్లలు స్కూల్‌కు వెళ్లడం, వృద్ధులు హాస్పిటల్‌కు వెళ్లడం, ప్రతి రోజు ఉద్యోగాలకు వెళుతున్న ప్రజలకు ఇది పెద్ద ఇబ్బంది. దారి మూసివేయడానికి ఎలాంటి అధికారం ఎవరికీ లేదు అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా మేము అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదు. మా సమస్యలను ఎవరూ లెక్క చెయ్యడంలేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక, కాలనీలో వున్నరహదారిపై ఇటీవల అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులు ప్రారంభించి, వాటిని మధ్యలోనే ఆపివేయడం వల్ల పరిస్థితి మరింత దారుణమైంది. రోడ్డు బంద్ చేసిన వారు తమ ప్రయోజనం కోసం ప్రజల ప్రయాణ హక్కులను దెబ్బతీస్తున్నారని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.



## జూబ్లీహిల్స్ లో బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గెలుపు తథ్యం

*** మాజీ ఎమ్మెల్యే , ఇంచార్జ్ బానోత్ హరిప్రియ నాయక్**

ప్రజా స్ఫూర్తి, ఇల్లందు:జూబ్లీహిల్స్ లో బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గెలుపు తథ్యమని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే & ఇంచార్జ్ బానోత్ హరిప్రియ నాయక్ ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా జూబ్లీహిల్స్ బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత మద్దతుగా యూసుఫ్ గూడా ఇంచార్జ్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర నేతృత్వంలో ఇల్లందు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు & ఇంచార్జ్ బానోత్ హరిప్రియ నాయక్ బుధవారం ఇల్లందు నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి పార్టీ శ్రేణులతో కలిసి నేతాజీ నగర్, యూసుఫ్ గూడా, వెంకటాద్రి నగర్ లో విస్తృత పర్యటన పర్యటన నిర్వహించి,ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే , ఇంచార్జ్ బానోత్ హరిప్రియ నాయక్ మాట్లాడుతూ రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం దివాలా తీసిందని,చేసిన పనులు చెప్పుకోలేని దౌర్భాగ్య పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్ పతనం ఖాయమని జూబ్లీహిల్స్ లో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాగంటి గోపీనాథ్ చేసిన అభివృద్ధి పనులే భారీ మెజార్టీతో ఘనవిజయం సాధిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో ప్రజల నుండి అపూర్వ స్పందన లభిస్తోందని, ప్రజలంతా ఇప్పుడు అసలైన మార్పు కోసం ఎదురు చూస్తున్నారని,బిఆర్ఎస్ పార్టీ విజయ డంకా జూబ్లీహిల్స్ నుంచే మొదలవుతుందని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకులు సిలివేరి సత్యనారాయణ, లకావత్ దేవి లాలు నాయక్, యూసుఫ్ గూడె ఇంచార్జ్ యూసుఫ్, ఇల్లందు నియోజకవర్గ సోషల్ మీడియా యువజన నాయకులు గిన్నారపు రాజేష్, కొంటూ రవికాంత్, గుడిబండ్ల శ్యామ్, వార రమేష్, భుఖ్య సురేష్, ఇంతియాజ్ ,షేక్ చాంద్ పాషా, తదితరులు పాల్గొన్నారు



## జీడిమెట్ల పారిశ్రామిక వాడను ఏర్పాటు చేయించి అభివృద్ధి చేసిన ఘనత కె.ఎం. పాండు కె దక్కింది

*** బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : ఆసియా ఖండంలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడ అయిన "జీడిమెట్ల పారిశ్రామిక వాడను ఏర్పాటు చేయించి అభివృద్ధి చేసిన ఘనత దివంగత మాజీ మున్సిపల్ చైర్మన్ కె.ఎం. పాండు కె దక్కుతుందని కె.ఎం. పాండు తనయుడు, బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. బుధవారం చింతల్ ప్రధాన రహదారిలోని కెఎం. పాండు మార్గ్ లో నిర్వహించిన కుత్బుల్లాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్, దివంగత నేత కెఎం.పాండు 7వ వర్ధంతి కార్యక్రమంలో వారి తనయుడు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్,కుత్బుల్లాపూర్ మాజీ కార్పొరేటర్ కెఎం.గౌరీష్ , బాపూ కె.ఎం.పాండు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన జీవిత పర్యాంతం కుత్బుల్లాపూర్ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషిచేసిన మహోన్నత నాయకులు, ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయిన చిరస్మరణీయ నేత కెఎం. పాండు ని అన్నారు. ఇందిరా గాంధీ ప్రభుత్వంలో నాడు కుత్బుల్లాపూర్ మున్సిపల్ చైర్మన్ గా ఉన్న పాండు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి జీడిమెట్ల పారిశ్రామిక వాడను ఏర్పాటు చేయించారన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భవిష్యత్తు తరాలు బాగుండాలంటే అందరికీ విద్యా అందించాలని, నిరుపేదల విద్య కోసం అనునిత్యం తపించిన నాయకులు కె.ఎం.పాండు అని అన్నారు. వారి ఆశయ సాధనలో భాగంగానే ఒకేషనల్ కాలేజీ ఏర్పాటు చేయడం జరిగింది. నేడు కుత్బుల్లాపూర్ లోని ఎంతోమంది నాయకులు కుత్బుల్లాపూర్ పాఠశాలలోనే విద్యనభ్యసించారన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన నుంచి పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## జనకల్యాణ్ దివాస్ ను విజయవంతం చేయాలి

*** తగరం సుభాష్ చంద్రబోస్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: బీఎస్పీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 6వ తేదీ నుంచి జనవరి 15వ తేదీ వరకు నిర్వహించ తలపెట్టిన జనకళ్యాణ్ దివాస్ ను విజయవంతం చేయాలని బీఎస్పీ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు తగరం సుభాష్ చంద్రబోస్ పిలుపునిచ్చారు. చౌటుప్పల్ మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శతాబ్ద కాలంగా బహుజనులు మానవ హక్కులకు నోచుకోకుండా జంతువుల కంటే హీనంగా బ్రతుకులు వెళ్ళదీశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కాలంలోనే మహాత్మా జ్యోతిబా పూలే నుంచి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వంటి మహనీయులు చేసిన పోరాటాల ఫలితంగా ఏర్పడిన రాజ్యాంగం వల్ల మాత్రమే బహుజన ప్రజలు లబ్ది పొందుతున్నారన్నారు. ప్రస్తుతం రాజ్యాంగం ఉనికి ప్రమాదంలో పడే అవకాశం ఉందని, బహుజనులు మేల్కొని మన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత నెలకొందన్నారు. రాజ్యాంగ రక్షణే ధ్యేయంగా బిఎస్పీ పార్టీ పోరాడుతుందన్నారు. బీఎస్పీ పార్టీ బలోపేతం కావడం, ఆర్థికంగా పుంజుకోవడమే లక్ష్యంగా జనకళ్యాణ్ దివాస్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి విరాళాల సేకరణ చేపట్టనున్నట్టు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు బీఎస్పీ పార్టీ బలోపేతానికి విరాళాలు అందజేయాలని కోరారు.

## వైభవంగా కార్తీక దిపోత్సవం..

**- ప్రతి ఇంట సంతరించుకున్న కార్తీక దీపం శోభ..**



అందోలు, ప్రజాస్ఫూర్తి :కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయాలు, ఇళ్ల ముంగిట మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రతి ఇంట ముందర ఉన్న తులసి చెట్టు కుండీలను ప్రత్యేకంగా అలంకరించి దీపాలు వెలిగించి మహిళా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మారేడు ఆకుల నమూనాలో బిల్వ వత్తి, పువ్వు వత్తులు, రుద్రాక్ష వత్తి, ఇలా వివిధ రకాలుగా వాడుతూ దీపాలు వెలిగించారు. అందోలు మండలంలోని ఈశ్వరాలయం వద్ద కార్తీక శోభ సంతరించుకుంది. గ్రామానికి చెందిన భక్తులు ఆలయానికి చేరుకొని ఆలయం వద్ద దీపాలు వెలిగించారు. ఈ నెలలో దీపాలు వెలిగించటం వల్ల జ్ఞానం, ఆనందం సిద్ధిస్తాయని ప్రవచనకారుల ఉవాచ. గృహాల్లో నిత్య దీపారాధనను ఆచరించటం సాధ్యంకాని భక్తులు కార్తిక పౌర్ణమి రోజు 365 వత్తులు వెలిగిస్తే ఏడాదంతా దీపాలను వెలిగించినట్లే అనే భావనతో దీపాలను వెలిగించారు.

## మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావును పరామర్శించిన టిఆర్ఎస్ నాయకులు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావును బుధవారం టిఆర్ఎస్ నాయకులు సుదగాని వెంకటేష్ గౌడ్, మేడి చంద్రశేఖర్ తదితరులు పాల్గొని పరామర్శించారు.

## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లు.. నేడు మరోసారి స్పీకర్ విచారణ

మరో నలుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నేడు, రేపు విచారణ చేపట్టనున్నారు. తిరిగి ఈనెల 12,13 తేదీల్లో కూడా విచారణ కొనసాగనున్నది. ఈ విచారణలో ఎమ్మెల్యేల న్యాయవాదులు, పిటిషనర్ల న్యాయవాదులు తమ వాదనలు, క్రాస్ ఎగ్జామినేషన్ లు చేయనున్నారు. ఇటీవలే నలుగురు ఎమ్మెల్యేల విచారణ పూర్తి చేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఈసారి జరిగే విచారణలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, శేరులింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీలపై దాఖలైన పిటిషన్లను విచారించనున్నారు. గురువారం ఉదయం 11 గం.లకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద వర్సెస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, ఉదయం 12 గం.లకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి వర్సెస్ సంజయ్, ఈనెల 7న ఉదయం 11గం.లకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి వర్సెస్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి, ఉదయం. 12గం.లకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ వర్సెస్ ఎమ్మెల్యే అరికపూడి గాంధీ న్యాయవాదుల మధ్య వాదనలు, క్రాస్‌ఎగ్జామినేషన్ జరుగనున్నది. ఈనెల 12న కేపీ వివేకానంద వర్సెస్ తెల్లం వెంకట్రావు, జగదీష్‌రెడ్డి వర్సెస్ సంజయ్, ఈనెల 13న జగదీష్‌రెడ్డి వర్సెస్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్ వర్సెస్ అరికపూడి గాంధీ న్యాయవాదుల మధ్య వాదనలు క్రాస్ ఎగ్జామినేషన్ జరుగునున్నది. దీనితో ఎనిమిది ఎమ్మెల్యేల విచారణ పూర్తి కానున్నది. స్పీకర్ విచారణ సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణంలో పలు ఆంక్షలు విధించారు.

## ఇన్సూరెన్స్ అనేది ప్రతి ఒక్కరికి అవసరం

* టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే కూనంనేని



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:ప్రస్తుత కాలంలో ఇన్సూరెన్స్ అనేది ప్రతీ ఒక్కరికి అవసరమేనని, ఇన్సూరెన్స్ చేయించడం ద్వారా భవిష్యత్తులో జరిగే పరిణామాల వల్ల కుటుంబానికి ఆర్థిక భరోసా కలుగుతుందని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. ఝాన్సీరాణి ఫైనాన్సియల్ సర్వీసెస్ సీఈవో, టాటా ఏఐఏ సీనియర్ బిజినెస్ అసోసియేట్ పి. కమలారాణి ఆధ్వర్యంలో చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీ నందు ఏర్పాటు చేసిన టాటా ఏఐఏ కార్యాలయాన్ని బుధవారం ముఖ్య అతిథిగా హాజరైన కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఇన్సూరెన్స్ రంగంలో టాటా కంపెనీ ప్రతీ ఒక్కరి నమ్మకాన్ని కలిగి ఉందని అన్నారు. ప్రతి ఒక్కరు జీవిత భీమా చేయించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇన్సూరెన్స్ రంగానికి మంచి భవిష్యత్తు ఉందని, నిరుద్యోగ యువత కూడా ఇన్సూరెన్స్ రంగంలో చేరి అభివద్ధి చెందవచ్చునన్నారు. భీమా అనేది జీవితానికి భీమా కల్పిస్తుందన్నారు. ఇటీవల వివిధ కారణాలతో మరణించి, టాటా కంపెనీలో ఇన్సూరెన్స్ చేయించిన వారి కుటుంబాలకు రూ. కోటి పరిహారం చెల్లించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇన్సూరెన్స్ S ద్వారా వచ్చిన డబ్బుల వల్ల ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబాలకు ఆర్థిక భరోసా కలిగిందన్నారు. కుటుంబంలో ఇంటి పెద్దదిక్కుతోపాటు ఇతరులకు కూడా అవకాశం ఉన్న మేరకు ఇన్సూరెన్స్ చేయించుకోవడం మంచిదని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్‌పాషా, టాటా ఏఐఏ సీనియర్ పార్ట్‌నర్స్ ఎస్. ముకుందరావు, పి. రాంగోపి, కొత్తగూడెం బ్రాంచి మేనేజర్ జక్కుల సతీష్, అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ వెంకటేష్ రాహుల్, లీడర్స్ నాగచందర్, గాయత్రి, దేవ్‌సింగ్, అడ్వైజర్స్ సామ్రాజ్యం, దేవరాజ్, పి.ప్రసాద్, రామారావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

**పర్యావరణాన్ని కాపాడండి...:** నైనిక రజువా మనిషికి ఇన్సూరెన్స్‌తో పాటు ప్రాణవాయువు కూడా చాలా అవసరమని ప్రకతి ప్రేమికురాలు, హరితదీక్షాపరురాలు నైనిక రజువా అన్నారు. టాటా ఏఐఏ ఇన్సూరెన్స్ కార్యాలయం ప్రారంభం సందర్భంగా ముఖ్య అతిధులుగా హాజరైన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు సింగరేణీయన్, హరిత దీక్ష వ్యవస్థాపకులు మొక్కల రాజ శేఖర్ అధ్వర్యంలో నైనిక మొక్కలు అందచేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్న వయస్సులోనే ప్రకతిని కాపాడటం కోసం దీక్ష చేపట్టడం అభినందనీయమన్నారు. నైనికకు మంచి భవిష్యత్తు ఉందని, తనను ఆదర్శంగా తీసుకుని ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని సూచించారు.



## పంటనష్టం పరిహారం రూ.6.. 'మహా' ప్రభుత్వంపై మండిపాటు

భారీ వర్షాలు, వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన మహారాష్ట్ర రైతులు.. పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. వీటితోపాటు రుణమాఫీ చేయాలని కోరుతూ పలు ప్రాంతాల్లో ఆందోళన చేపడుతున్నారు. ఈ క్రమంలో ఛత్రపతి శంభాజీనగర్, అకోలా తదితర జిల్లాల రైతులకు రూ.పది కంటే తక్కువ పరిహారంగా అందడం చర్చనీయాంశమైంది. ఈ పరిణామాలపై మహారాష్ట్ర రైతుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. పంట నష్టంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులను పరామర్శించేందుకు మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే మరాఠ్వాడాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా పైఠణ్ తాలుకా దావర్వాడి గ్రామానికి చెందిన సుధాకర్ టాంగ్డే అనే రైతు.. తనకు కేవలం రూ.6 మాత్రమే పంట పరిహారం కింద అందినట్లు మీడియాతో వాపోయాడు. తనకు రెండు ఎకరాలు ఉందని, ప్రభుత్వం ఇచ్చిన ఈ ఆర్థిక సాయం కనీసం టీ తాగడానికి కూడా సరిపోదన్నారు. రైతులతో ప్రభుత్వం ఆటలు ఆడుతోందని అన్నారు. అకోలా జిల్లాలోని కొందరు రైతులు కూడా తమకు ఇటువంటి అనుభవమే ఎదురైందని ఇటీవల వాపోయారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద కేవలం రూ.3, రూ.21 మాత్రమే ఆర్థిక సాయం అందుకున్నామని పలువురు రైతులు పేర్కొన్నారు. ఇది తమకు అవమానకరమని, హేళన చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా తక్కువ పరిహారం అందుకున్న అనేక మంది రైతులు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగి, ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో తిరిగి ఇచ్చారు. మరోవైపు రుణమాఫీపైనా రాష్ట్రంలో ఆందోళనలు కొనసాగుతున్న విషయం తెలిసిందే.

## హైడ్రోజన్ బాంబ్ పేల్చిన రాహుల్.. ఈసీ కౌంటర్



హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని బుధవారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. హైడ్రోజన్ బాంబ్ పేరిట ఎన్నికల సంఘం, భాజపాపై తీవ్ర విమర్శలు గుప్పించారు. వాటికి ఎన్నికల సంఘం నుంచి కౌంటర్ వచ్చింది. గత ఏడాది హరియాణాలో ఎన్నికలు జరిగాయని, వాటికి ముందు హస్తం పార్టీ నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదని చెప్పారు. ''రాహుల్ గాంధీ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సమర్థిస్తున్నారా? వ్యతిరేకిస్తున్నారా..? హరియాణాలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటర్ జాబితాపై కాంగ్రెస్ ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తంచేయలేదు. పోలింగ్ స్టేషన్లలో కాంగ్రెస్ పోలింగ్ ఏజెంట్లు ఏం చేస్తున్నారు'' అని ప్రశ్నించింది.

## పంజాబ్‌లో కబడ్డీ ప్లేయర్ కాల్చివేత



**: బిష్ణోయ్ గ్యాంగ్ ఘాతుకం**

పంజాబ్‌లోని లుథియానాలో ఓ కబడ్డీ ప్లేయర్ దారుణ హత్యకు గురయ్యాడు. లుథియానా జిల్లాలోని సమ్రాలా బ్లాక్‌లో కబడ్డీ ఆటగాడు గుర్వీందర్ సింగ్‌ను దుండగులు కాల్చి చంపారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ అన్మోల్ బిష్ణోయ్ పేరిట సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. గుర్వీందర్ సింగ్‌ను తమ గ్యాంగ్‌కు చెందిన కరణ్, తేజ్ చక్ అనే వ్యక్తులు హత్య చేసినట్లే అందులో పేర్కొంది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇదిలాఉండగా ఇటీవల కెనడాలో హత్యకు గురైన భారత సంతతికి చెందిన పారిశ్రామికవేత్త దర్శన్‌సింగ్ సహోసిని తామే చంపినట్లు ఇటీవల బిష్ణోయ్ గ్యాంగ్ అంగీకరించింది. అతడు తమకు డబ్బులు ఇవ్వకపోవడంతో హత్య చేసినట్లు వెల్లడించింది. కెనడాలోని పంజాబీ గాయకుడు చాని నట్టన్ ఇంటి వెలుపల జరిగిన కాల్పులకు కూడా బాధ్యత వహించింది. కాగా అక్టోబర్ 31న లుథియానాకు చెందిన 26 ఏళ్ల కబడ్డీ ఆటగాడు తేజ్‌పాల్ సింగ్ హత్యకు గురయ్యాడు. స్నేహితులతో కలిసి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో వారితో గొడవ జరగడంతో తేజ్‌పాల్ స్నేహితులే అతడిని హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. పంజాబ్‌లో వరుసగా జరుగుతున్న హింసాత్మక ఘటనలపై అక్కడి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్‌కు 'వరల్డ్ లీడర్ ఫర్ పీస్ అండ్ సెక్యూరిటీ' అవార్డు



బోస్టన్: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్ '2025 వరల్డ్ లీడర్ ఫర్ పీస్ అండ్ సెక్యూరిటీ' అవార్డును అందుకున్నారు. బోస్టన్ గ్లోబల్ ఫోరం, AI వరల్డ్ సొసైటీ ఆధ్వర్యంలో అమెరికాలోని బోస్టన్‌లో ఆయన్ను ఘనంగా సన్మానించారు. భారత్‌తో పాటు ప్రపంచంలో శాంతి, పరిరక్షణ, నాయకత్వాన్ని ప్రోత్సహించడంలో ఆయన చేసిన కృషికి గాను ఈ పురస్కారంతో గౌరవించారు. వరల్డ్ లీడర్ ఫర్ పీస్ అండ్ సెక్యూరిటీ అవార్డు పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 2025 సంవత్సరానికి గాను గురుదేవ్‌ను ఎంపిక చేశారు. ఈ అవార్డును ప్రారంభించినప్పటి నుంచి ప్రపంచ శాంతికి సంబంధించి నైతిక, వ్యూహాత్మక మూలాలను బలోపేతం చేసిన అసాధారణ వ్యక్తులను సన్మానిస్తున్నారు. గతంలో ఈ పురస్కారం అందుకున్న ప్రముఖుల జాబితాలో జపాన్ మాజీ ప్రధాని షింజో అబే, జర్మనీ అప్పటి ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్ (2015), ఐరాస మాజీ సెక్రటరీ జనరల్ బాన్‌కీ మూన్ (2016), ఫిన్‌లాండ్ మాజీ అధ్యక్షుడు సౌలి నీనిస్టో (2018), ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ (2022), ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ (2024) ఉన్నారు. ఈ అవార్డు ఏర్పాటై పదేళ్లు అయిన సందర్భంగా గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్‌ను సత్కరించిన బోస్టన్ గ్లోబల్ ఫోరం .. 21వ శతాబ్దం శాంతి, అంతర్గత సామరస్యం, మతాంతర చర్చలు, ఎథికల్ టెక్నాలజీపై నిర్మితం కావాలని పునరుద్ఘాటించింది. శాంతి, సమన్వయం, ప్రపంచ నాయకత్వాన్ని ముందుకు తీసుకెళ్లడం ద్వారా 180 దేశాల్లో మానవతా ప్రభావం, ఏఐ, డిజిటల్ యుగంలో నైతిక మార్గదర్శనం చేసినందుకు గాను ఈ గుర్తింపు పొందినట్లు పేర్కొంది. వ్యక్తిగతంగా ఆయన అనేక ఘర్షణ ప్రభావిత ప్రాంతాల్లో మధ్యవర్తిత్వం వహించారని తెలిపింది. కొలంబియాలో గురుదేవ్ ప్రమేయంతో ఎఫ్ఏఆర్‌సీ, ప్రభుత్వం మధ్య 52 ఏళ్ల సాయుధ సంఘర్షణకు ముగింపు పలికిందన్నారు. ఇరాక్, శ్రీలంక, మయన్మార్, వెనిజులాల్లోనూ ఆయన మానవత్వంతో విభిన్న వర్గాల్లో విశ్వాసం పెంపొందించి ఏకతాటిపైకి తీసుకురావడంలో కృషిచేశారు. కశ్మీర్‌లో అనేక మందిని హింసను త్యజించి సమాజంలో తిరిగి కలిసిపోయేలా కృషి చేశారని బోస్టన్ గ్లోబల్ ఫోరం సహ వ్యవస్థాపకుడు, సీఈవో అన్స్ తువాన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## డేటింగ్ యాప్‌లో పరిచయమై.. మమ్‌దానీ విజయం వెనుక 'ఆమె'!



న్యూయార్క్ నగర మేయర్ అధికారిక నివాసం 'గ్రేసీ మాన్షన్'లోకి అడుగుపెట్టనున్న భారత మూలాలున్న జొహ్రాన్ మమ్‌దానీ .. యువ మేయర్‌గానూ చరిత్ర సృష్టించనున్నారు. ఈ సందర్భంగా ఆయన సతీమణి రామా సవాఫ్ దువాజీ పేరు ప్రముఖంగా వినిపించింది. ప్రచారంలో కనిపించనప్పటికీ తెరవెనుక కీలకంగా వ్యవహరించినట్లు అమెరికా మీడియా పేర్కొంది. అయితే, కొంతకాలం క్రితమే వివాహ బంధంలోకి ఈ జంట అడుగుపెట్టగా.. పరిచయం నుంచి వివాహం వరకు వీరి ప్రయాణం ఆసక్తిగా కొనసాగింది. సిరియన్ అమెరికన్ సంతతికి చెందిన రామా దువాజీ ఓ చిత్రకారిణి. యానిమేటర్. 1997 జూన్ 30న టెక్సాస్‌లో జన్మించారు. ఆమె కుటుంబానికి సిరియా, దుబాయితో అనుబంధం ఉంది. తొమ్మిదేళ్ల వయసు ఉన్నప్పుడు ఆమె కుటుంబం దుబాయికి మారింది. సిరియా మూలాలున్న దువాజీ భిన్న సంస్కృతులకు నెలవైన దుబాయి వాతావరణాన్ని అలవరచుకున్నారు. నాలుగేళ్ల క్రితమే న్యూయార్క్‌కు వెళ్లిన ఆమె.. నగరంలోని స్కూల్ ఆఫ్ విజువల్ ఆర్ట్స్‌లో మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ పూర్తిచేశారు. చిత్రకారిణిగా స్త్రీ సాధికారతపైనే ఎక్కువ దృష్టి పెట్టే దువాజీ.. పాలస్తీనీయన్ల దుస్థితిపైనా డిజిటల్ చిత్రాలు రూపొందించారు. ప్రముఖ వార్తా పత్రికలు, డిజిటల్ వేదికల్లో ఆమె కళారూపాలు ప్రచురితమయ్యాయి. ఈ క్రమంలోనే ఓ డేటింగ్ యాప్‌లో మమ్‌దామీతో మొదలైన పరిచయం ప్రేమ, పెళ్లివరకు వెళ్లింది. దుబాయ్‌లో గతేడాది అక్టోబర్‌లో నిశ్చితార్థం, డిసెంబర్‌లో వివాహం ప్రైవేటుగా జరిగాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో న్యూయార్క్‌లో రిజిస్టర్ వివాహం చేసుకున్న ఈ జంట.. జులైలో ఉగాండాలో పెళ్లి వేడుక నిర్వహించారు. తాజాగా మేయర్‌గా ఎన్నికైన మమ్‌దానీ విజయోత్సవ ప్రసంగంలో మాట్లాడుతూ.. తన ప్రయాణంలో వేలాది మంది మద్దతుదారులతో పాటు తల్లిదండ్రులు, సతీమణి పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రతి పురుషుడి విజయం వెనుక ఓ మహిళ ఉంటుందన్న విషయాన్ని గుర్తుచేసిన ఆయన.. ఈ క్షణం, ప్రతిక్షణంలో తనకు తోడుగా నిలిచే వ్యక్తి తన సతీమణే అని పేర్కొన్నారు. అయితే, భిన్న సంప్రదాయాలతో టెక్సాస్, దుబాయితో అనుబంధాన్ని కొనసాగిస్తున్న దువాజీ.. న్యూయార్క్ నగరంలోనూ తనదైన ముద్ర వేసుకునేందుకు సిద్ధమయ్యారు.

## డెమోక్రాట్ల హవా.. ట్రంప్ పాలనకు రెఫరెండమేనా..?



అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన తర్వాత దూకుడుగా వ్యవహరిస్తున్న ట్రంప్ కు ఏడాది కాకముందే చుక్కెదురు అయ్యింది. తాజాగా జరిగిన పలు రాష్ట్రాల గవర్నర్ల ఎన్నికల్లో అధికార పార్టీకి ప్రతికూల ఫలితాలు వచ్చాయి. న్యూజెర్సీ, వర్జీనియా రాష్ట్రాల గవర్నర్లతో పాటు న్యూయార్క్ మేయర్‌గా డెమొక్రాట్ అభ్యర్థులే జయకేతనం ఎగరవేశారు. వచ్చే ఏడాది మిడ్‌టర్మ్ ఎన్నికలు జరగనున్న వేళ రిపబ్లికన్లకు ఈ ఫలితాలు ఓ సవాల్ అనే చెప్పవచ్చు. వర్జీనియా, న్యూజెర్సీ గవర్నర్ ఎన్నికల్లో డెమొక్రటిక్ అభ్యర్థులే విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో అత్యంత కీలకంగా మారిన న్యూయార్క్ నగర మేయర్ పదవిని డెమొక్రటిక్ పార్టీకి చెందిన జొహ్రాన్ మమ్‌దానీ కైవసం చేసుకున్నారు. మరోవైపు ఒహాయోలోని సిన్సినాటి నగర మేయర్‌గా ఇదే పార్టీకి చెందిన అఫ్తాబ్ పురేవాల్ విజయం సాధించారు. వరుసగా రెండోసారి గెలుపొందిన ఈయన.. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సమీప బంధువు (సోదరుడు)పై ఈసారి విజయం సాధించడం విశేషం. న్యూజెర్సీ నూతన గవర్నర్ పోటీలో డెమొక్రాట్ అభ్యర్థి మికీ షెరిల్ విజయం సాధించారు. రిపబ్లికన్ అభ్యర్థి జాక్ సియాటరెల్లీపై ఆమె గెలుపొందారు. వర్జీనియా గవర్నర్‌గా డెమొక్రాట్ అభ్యర్థి అబిగైల్ స్పాన్‌బెర్గర్ విజయం సాధించారు. ఈ పదవి చేపట్టనున్న తొలి మహిళగా ఆమె రికార్డు సృష్టించనున్నారు. ఇక్కడ లెఫ్టినెంట్ గవర్నర్‌గా డెమొక్రాట్ అభ్యర్థి, భారత సంతతి నేత గజాలా హష్మీ విజయం సాధించారు.

**రెఫరెండమేనా..?**

అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లోనే ట్రంప్‌నకు ప్రతికూల ఫలితాలు వచ్చాయి. ఆయన పార్టీకి చెందిన అభ్యర్థులను పలు రాష్ట్రాల ప్రజలు తిరస్కరించారు. ఇటీవల వర్జీనియా, న్యూజెర్సీల్లో నిర్వహించిన పోల్‌లోనూ దేశంలో నెలకొన్న తాజా పరిణామాలపై ప్రతి 10మందిలో ఆరుగురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తేలింది. కేవలం మూడులో ఒకవంతు మాత్రమే ప్రస్తుత పాలనపై సంతృప్తిగా ఉన్నామని చెప్పారు. ఈ ఎన్నికల ఫలితాలపై 'బిగ్ బ్యూటిఫుల్' బడ్జెట్ బిల్లు సహా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపు వంటి ట్రంప్ ప్రభుత్వ విధానాలు ప్రభావం చూపాయనే వాదన వినిపిస్తోంది. అయితే, ఎన్నికలకు ట్రంప్ దూరంగా ఉండటం, షట్‌డౌన్ వల్లే రిపబ్లికన్లు ఓటమి చెందారని రాజకీయ విశ్లేషకులు చెప్పినట్లు అమెరికా అధ్యక్షుడు తన సొంత సోషల్ మీడియా వేదికగా పేర్కొనడం గమనార్హం. తాజా ఫలితాలపై మాజీ అధ్యక్షులు బిల్ క్లింటన్, బరాక్ ఒబామాలు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్నవారివైపే ప్రజలు నిలిచారని విశ్లేషించారు.

# టెన్త్ విద్యార్థులకు బండి సంజయ్ కానుక

కరీంనగర్, నవంబర్ 05 : కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుకునే విద్యార్థులందరికీ శుభవార్త. ఈ ఏడాది టెన్త్ ఎగ్జామ్ ఫీజును పూర్తిగా చెల్లించేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ముందుకొచ్చారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు కేంద్ర మంత్రి లేఖ రాశారు. అధికార వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 12,292 మంది విద్యార్థినీ, విద్యార్థులు పదో తరగతి చదువుకుంటున్నారు. వీరిలో కరీంనగర్ జిల్లాలో 4,847, సిరిసిల్ల జిల్లాలో 4059, సిద్దిపేట జిల్లాలో 1118, జగిత్యాల



జిల్లాలో 1135, హన్మకొండ జిల్లాలో 1133 మంది విద్యార్థులున్నారు. వీరందరికీ పరీక్ష ఫీజు చెల్లించాలంటే రూ.15 లక్షలకుపైగా ఖర్చవుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారే. వారిలో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు కూలీ పని చేసి బతికేటోళ్లు. పిల్లలకు పరీక్ష ఫీజు కూడా చెల్లించే పరిస్థితి లేదని తెలుసుకున్న బండి సంజయ్ తన నియోజకవర్గ పరిధిలోని ఆయా స్కూళ్లలో చదివే విద్యార్థుల ఫీజు మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించుకున్నారు. ఆ మొత్తాన్ని తన వేతనం నుండి చెల్లించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖలు పంపారు. వాస్తవానికి బండి సంజయ్ కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులతోపాటు సరస్వతి శిశు మందిరాల్లో చదువుకునే విద్యార్థులుసహా దాదాపు 20 వేల మందికి "మోదీ గిఫ్ట్" పేరుతో బ్రాండెడ్ సైకిళ్లను పంపిణీ చేశారు. అతి త్వరలోనే సర్కారీ స్కూళ్లలో 9వ తరగతి చదువుకునే విద్యార్థులకు సైతం సైకిళ్లను పంపిణీ చేస్తామని ప్రకటించారు. అట్లాగే వచ్చే ఏడాది విద్యా సంవత్సరం ఆరంభంలోనే 'మోదీ కిట్స్' పేరుతో విద్యార్థులందరికీ స్కూల్ బ్యాగ్, నోట్ బుక్స్, జామెట్రీ బాక్స్, పెన్ను, పెన్సిళ్లు, స్టీల్ వాటర్ బాటిల్ ను పంపిణీ చేయబోతున్నారు.

## జగద్గిరిగుట్ట బస్టాండ్‌లో యువకుడిపై కత్తితో దాడి

జీడిమెట్ల: హైదరాబాద్ నగరంలోని జగద్గిరిగుట్ట బస్టాండ్‌లో దారుణ ఘటన చోటు చేసుకుంది. అందరూ చూస్తుండగానే ఓ యువకుడిపై హత్యాయత్నం జరిగింది. రోషన్ అనే యువకుడిపై బాల్ రెడ్డి అనే రౌడీషీటర్, మరో వ్యక్తి కత్తితో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన యువకుడిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఆర్థిక లావాదేవీల నేపథ్యంలోనే ఈ హత్యాయత్నం జరిగినట్లు అనుమానిస్తున్నారు. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.



## కాంగ్రెస్ అంటేనే కరెంట్ : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, నవంబర్ 05 : కాంగ్రెస్ అంటేనే కరెంట్.. కరెంట్ అంటేనే కాంగ్రెస్.. కాంగ్రెస్ పార్టీ పవర్ లోకి రాగానే ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తూ సంపన్న పాలనను అందిస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పరిగి లో 220 కెవి సబ్ స్టేషన్ ను బుధవారం ప్రారంభించి, నూతనంగా 9 సబ్ స్టేషన్ల నిర్మించేందుకు శిలాఫలకాలకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం విద్యుత్ ఎమర్జెన్సీ వాహనాలు, 98 ట్రాన్స్ ఫార్మర్లను వివిధ సబ్ స్టేషన్లు పంపిణీ చేశారు. అనంతరం పరిధిలోని ఏబిఎస్ ప్లాజాలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రజలు ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి చూపిస్తున్న జనాదరణను చూసి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంటు ఉండదని ప్రజలను మభ్య పెట్టారు. బీఆర్ఎస్ ఇతర పార్టీల మాటలను తిప్పి కొట్టి ఓటర్లు కాంగ్రెస్ చేతికి పట్టం కట్టి పవర్ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి తో కలిసి మేమంతా అమలు చేస్తూ సంపన్న పాలను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ అందిస్తూ, గృహ జ్యోతి పథకం కింద అర్హులైన పేదలందరికీ 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేస్తూ పేదల ఇళ్లలో కాంగ్రెస్ వెలుగు నింపుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 53



లక్షల ఉచిత కరెంట్ అందజేస్తున్నామన్నారు. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా 1,40,193 ఇళ్లకు ఉచిత కరెంటు ఇస్తూ 56 శాతం పేద ప్రజల ఇళ్లలో గృహ జ్యోతి కాంగ్రెస్ పార్టీ వెలుగునిస్తోందన్నారు. పరిగి నియోజకవర్గ వ్యాప్తంగా 70377 ఇళ్లకు ఉచిత కరెంటు అందజేస్తుందన్నారు. అంతేకాకుండా 27,970 వ్యవసాయ పంపు సెట్లు రైతులకు ఏళ్ల తరబడిగా కాంగ్రెస్ ఉచిత కరెంటు ఇస్తుందని సగర్వంగా తెలియజేస్తున్నామన్నారు. పదేళ్లుగా టిఆర్ఎస్ పార్టీ అధికారం చలాయించి దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని, ఇంటికో ఉద్యోగం ఇస్తామని, బంగారు తెలంగాణ చేస్తామని, ఇలా అబద్ధపు హామీలు ఇచ్చి కుటుంబ పాలన కొనసాగించగా మీరు ఓటుతో ఓడించి గుణపాఠం చెప్పిన విషయం తెలిసిందేనన్నారు. ఇలా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత విద్యుత్ అందజేస్తూ ప్రతినెల 2830 కోట్లు ఆర్థిక శాఖ నుంచి విద్యుత్ శాఖకు డబ్బులు చెల్లిస్తున్నామన్నారు. పదేళ్లు టిఆర్ఎస్ పార్టీ ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో అభివృద్ధి పనులు చేసి ఫోటోలు దిగి పబ్బం గడిపిందని తప్పు పట్టారు. వికారాబాద్ జిల్లాతో పాటు పరిగి నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా మీ ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి పట్టుబట్టి మరి 400 కె విద్యుత్ సబ్ స్టేషన్ ఫైల్ పై సంతకం చేయించి మంజూరి చేయించుకున్నారన్నారు. అంతేకాకుండా హైదరాబాద్ నుంచి తెలంగాణ రాష్ట్ర బార్డర్ వరకు పరిగి నియోజకవర్గం మీదుగా నాలుగు లైన్ల రహదారి కోసం ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి ఎంతగానో కృషి చేసి పదేళ్ల క్రితం మంజూరు చేయించగా టిఆర్ఎస్ పార్టీ అడ్డుకుందన్నారు. మొన్నటికి మొన్న ఆర్టీసీ బస్సు కంకర టిప్పర్ ఢీకొని 20 మంది వరకు మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. మృతి చెందిన వారి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ప్రకటించి, వివిధ ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వద్ద ఒక్క రూపాయి తీసుకోకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆ ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారన్నారు. ముఖ్యంగా ప్రమాదాలకు నిలయమైన ఈ హైవే రోడ్డును నాలుగు లైన్ల రహదారిగా మార్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి తో మేమంతా పనిచేస్తూ శరవేగంగా పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు. కొన్నేళ్ల నుంచి వికారాబాద్ జిల్లాకు సాగునీరు తీసుకురావాలన్న సంకల్పమే ఎందుకు సాగుతున్నామన్నారు.

## 'మా డిమాండ్లు పరిష్కరించే వరకు కళాశాలల బంద్ కొనసాగిస్తాం'



హైదరాబాద్, నవంబర్ 05 : తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేవరకు బంద్ కొనసాగిస్తామని తెలంగాణ ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య అధ్యక్షుడు రమేశ్‌బాబు అన్నారు. గత నాలుగు రోజులుగా బంద్ చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చర్చలకు పిలిచిందని చెప్పారు. "జేఎన్‌టీయూ, ఉస్మానియా పరిధిలో నిర్వహిస్తున్న పరీక్షలను కళాశాలలు బహిష్కరించాయి. కళాశాల విద్య కమిషనర్ దేవసేన ఎంత వేధిస్తున్నా భరించాం. ఆమెను ఆ విభాగం నుంచి బదిలీ చేయాలని ఇప్పటికే ప్రభుత్వాన్ని కోరాం. ఫీజు బకాయిల్లో 50 శాతం చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాం. మా డిమాండ్‌లను పరిష్కరించే వరకు బంద్ కొనసాగిస్తాం. ఎల్బీ స్టేడియంలో ఈనెల 8న కళాశాలల అధ్యాపకుల సభ నిర్వహిస్తాం. సుమారు 70వేల మంది దీనికి హాజరవుతారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యల పరిష్కారానికి కమిటీ వేయడాన్ని స్వాగతిస్తున్నాం. మూడు నెలలకు బదులు ఒక నెలలోనే కమిటీ రిపోర్టు అడగాలి. మార్చి నాటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి. కాలేజీలపై విజిలెన్స్ దాడుల్లో నియంతృత్వ ధోరణి కనిపిస్తోంది. ఈ డిమాండ్లను పరిష్కరించకపోతే 10లక్షల మంది విద్యార్థులతో భారీ సభ నిర్వహిస్తాం" అని అన్నారు.

## ప్రతి హామీ నెరవేర్చుతాం.. ఆందోళన వద్దు : మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, నవంబర్ 05 : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కచ్చితంగా నెరవేర్చుతామని, ప్రతిపక్షాల మాటలు నమ్మి ఆందోళనకు గురి కావొద్దని ప్రజలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి ,అత్యధిక మెజార్టీతో నవీన్ యాదవ్ ను గెలిపించాలని కోరుతూ బుధవారం ఎల్లారెడ్డి గూడ, కమలాపురి కాలనీ, ఇమాంగూడ, జయప్రకాశ్ నగర్, తవాక్కల్ నగర్, అలీ నగర్ తదితర ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ తోనే సాధ్యమని, ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని ఇంటింటికి తిరిగి వివరించారు. తొమ్మిదేళ్ల పాలనలో నిరుద్యోగులను గాలికొదిలేసిన బీఆర్ఎస్ నేతలు



ఈ ఉప ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆరోపించారు. మా అభివృద్ధి, సంక్షేమ పథకాలు లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపుతుంటే, అది చూసి ఓర్వలేకే బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మాపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి అజెండాగా ముందుకు సాగుతున్న ఈ ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలని జూబ్లీహిల్స్ ఓటర్లకు మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు.



## శ్రీశైలం ఘాట్ రోడ్డులో అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు

అమ్రాబాద్, నవంబర్ 05 : నాగర్‌కర్నూలు జిల్లా పరిధిలోని శ్రీశైలం ఘాట్ రోడ్డులో ఓ తెలంగాణ ఆర్టీసీ బస్సు అదుపు తప్పింది. హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్తున్న బస్సు అమ్రాబాద్ మండలంలోని అక్కమహాదేవి గుహలకు వెళ్లే మార్గం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయమైన ప్రదేశంలో బస్సు కూరుకుపోయి రోడ్డుకు అడ్డంగా తిరిగింది. అయితే అందులోని ప్రయాణికులకు ఏ ఇబ్బంది కలగలేదు. రోడ్డుకు అడ్డంగా బస్సు ఉండిపోవడంతో ఆ మార్గంలో రాకపోకలకు అంతరాయం కలిగింది. సుమారు గంట సేపు వాహనాలు నిలిచిపోయాయి. ఈగలపెంట ఎస్సై జయన్న, పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రయాణికుల సహాయంతో బస్సును రోడ్డుపైకి ఎక్కించారు.

# ఎవరి అనుమతితో నాడు మిమ్మల్ని అరెస్టు చేశారు?.. సీఎం వ్యాఖ్యలకు రఘునందన్ రావు కౌంటర్

హైదరాబాద్, నవంబర్ 05 : కేసీఆర్ కుటుంబం అవినీతిపై ఆధారాలు ఉన్నాక గవర్నర్ అనుమతి పంచాయితీ ఎందుకొచ్చిదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు. ఎమ్మెల్యేను అరెస్టు చేయడానికి గవర్నర్ అనుమతి కావాలని ఎక్కడుంది? ఈ దేశం, రాష్ట్రంలో ఇప్పటి వరకు ఏ ఎమ్మెల్యే అరెస్టు కాలేదా? గత బీఆర్ఎస్ పాలనలో మిమ్మల్ని రెండు సార్లు అరెస్టు చేశారు. నాడు కేసీఆర్ ఎవరి అనుమతి తీసుకుని అరెస్టు చేశారని సీఎంను ప్రశ్నించారు. కేటీఆర్ అరెస్టు విషయంలో రేవంత్ రెడ్డి తీరు ఆడలేక మద్దెల ఓడు అన్న చందంగా ఉందని విమర్శించారు. ఇవాళ నాంపల్లిలోని బీజేపీ స్టేట్ ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడిన రఘునందన్ రావు.. పార్ములా ఈ కేసులో కేటీఆర్‌ను అరెస్టు చేసేందుకు గవర్నర్ అనుమతి కోరి 2 నెలలైనా స్పందన లేదని నిన్న జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. కేసీఆర్ కుటుంబ సభ్యులను అరెస్టు చేయవద్దని ఏఐసీసీ పెద్దలు చేసిన సూచన మేరకే వారిని అరెస్టు చేయకుండా అబద్ధాలతో టైమ్ పాస్ చేస్తున్నారని దుయ్యబట్టారు. కేటీఆర్‌ను ముందు రిమాండ్ చేయాలని ఆ తర్వాత కోర్టులో చూసుకుంటాయన్నారు.

*** 50 సార్లు ఢిల్లీ వెళ్లి వచ్చి ఒక్కసారైనా కలిశావా?:**

కేసీఆర్ కుటుంబం అవినీతిని కక్కిస్తామని



ఉత్తర కుమార ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చిన 23 నెలల తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీజేపీని ప్రశ్నిస్తున్నారని రఘునందన్ రావు నిలదీశారు. ఎన్డీఎస్ఏ, పీసీ ఘోష్ కమిషన్ నివేదికను హడావుడిగా అసెంబ్లీలో పెట్టి ఈ కేసును సీబీఐకి పంపితే దీనిపై కేసీఆర్, హరీశ్ రావు, మాజీ సీఎస్ ఎస్.కే జోషి, స్మితా సబర్వాల్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారని దాంతో వీరందరిపై సీబీఐ విచారణ ఆపాలని హైకోర్టు స్టే ఇచ్చిందన్నారు. మరో రెండు వారాల్లో ఏజీతో కౌంటర్ వేయాలని చెబితే ఇప్పటి వరకు కౌంటర్ వేయించలేదన్నారు. ఏసీబీ కేసులో అరెస్టు చేయించడం చేతకావడం లేదన్నారు. అరెస్టులు చేస్తే ప్రజలు బీఆర్ఎస్‌పై సింపతి చూపుతారేమోనన్న భయంతో అరెస్టు చేయకుండా బీజేపీని ఎందుకు విమర్శిస్తున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 50 సార్లు ఢిల్లీకి వెళ్లి వచ్చిన రేవంత్ రెడ్డి కేసీఆర్ కుటుంబం అవినీతిపై ప్రధానికో, కేంద్ర హోంశాఖ మంత్రికో ఫిర్యాదు చేశారా అని మండిపడ్డారు.

***అజారుద్దీన్ కు ఏ కోటాలో మంత్రి పదవి ఇచ్చారు?:**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రేవంత్ రెడ్డి మెడమీద కత్తిలా వేలాడుతోందని అందుకే ఆ భయంతోనే ఏది పడితే అది మాట్లాడుతున్నారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం వంగి వంగి దండాలు పెడుతోందని, జై పాలస్తీనా అన్నవారిని తమ వెంట తిప్పుకుంటోందన్నారు. ఎంఐఎం, కాంగ్రెస్ నాటకాలు ఆడుతోందన్నారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి బీసీ కోటాలో ఇచ్చారా లేక మైనార్టీ కోటాలో ఇచ్చారా అని రఘునందన్ రావు ప్రశ్నించారు. అజారుద్దీన్‌కు హడావుడిగా మంత్రి పదవి ఇప్పించుకున్న రేవంత్ రెడ్డికి నిజంగా బీసీకి 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న చిత్తశుద్ధి ఉంటే మిగతా ఇద్దరు బీసీలకు మంత్రులుగా అవకాశం ఇవ్వాల్సి ఉండేనన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య వీణావాణీల బంధం అన్నారు. నోరులేని కిషన్ రెడ్డిపై రోజు తిట్టడం రేవంత్ రెడ్డి స్థాయికి తగదన్నారు. బట్ట కాల్చి మీద వేస్తామంటే ఊరుకోబోమన్నారు.

## కర్ణాటకలో రోడ్డు ప్రమాదం.. నలుగురు తెలంగాణవాసుల మృతి

మానూర్ , నవంబర్ 05 : కర్ణాటకలోని హల్లిఖేడ్‌లో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వ్యాను, కారు ఢీకొన్న ఈ ఘటనలో నలుగురు తెలంగాణవాసులు మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులను సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్ గ్రామానికి చెందిన నవీన్ (40), రాచప్ప (45), కాశీనాథ్ (60), నాగరాజు (40) గా గుర్తించారు. వీరంతా గణగాపూర్ దత్తాత్రేయ ఆలయానికి వెళ్లి కారులో తిరిగి వస్తుండగా ఈ



ప్రమాదం చోటు చేసుకుంది.

## ఊపందుకున్న కమర్షియల్ వెహికిల్ సెక్టార్.. ఏసీఎంఐఐఎల్ నివేదిక..!



**న్యూఢిల్లీ:** భారతదేశ వాణిజ్య వాహన రంగం అక్టోబర్‌లో ఊపందుకున్నది. ప్రభుత్వం మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు వేగవంతం కావడం, పండుగ సీజన్‌లో లాజిస్టిక్స్ డిమాండ్ పెరగడం ఈ వృద్ధికి దోహదపడింది. ఏసీఎంఐఐఎల్ నివేదిక ప్రకారం.. దాదాపు అన్ని ప్రధాన ఆటో కంపెనీల పనితీరు మారింది. ఇది సరుకు రవాణా కార్యకలాపాలు, దేశ ఆర్థిక వ్యవస్థ రెండూ బలమైన స్థితిలో ఉన్నాయని సూచిస్తుంది. టాటా మోటార్స్ అక్టోబర్‌లో మొత్తం వాణిజ్య వాహన అమ్మకాల్లో 9.5 శాతం పెరుగుదలను నమోదైనట్లుగా పేర్కొంది. వరుసగా నాలుగు త్రైమాసికాల తర్వాత వృద్ధిని నమోదు చేయడం ఇది వరుసగా రెండోసారి. భారీ, చిన్న వాణిజ్య వాహన విభాగాలు రెండూ సింగిల్ డిజిట్ వృద్ధిని నమోదు చేయగా, ప్యాసింజర్ క్యారియర్ వాహనాల అమ్మకాలు 12.3 శాతం పెరిగాయి. కంపెనీ ఎగుమతులు కూడా 56.2 శాతం నమోదుకావడం అంతర్జాతీయ మార్కెట్‌లో కంపెనీ ఉనికిని మరింత బలోపేతం చేశాయి.

మహీంద్రా అండ్ మహీంద్రా అక్టోబర్‌లో మొత్తం వాణిజ్య వాహన అమ్మకాల్లో 14 శాతం పెరిగాయని పేర్కొంది. 2 టన్నుల నుంచి 3.5 టన్నుల బరువున్న తేలికపాటి వాణిజ్య వాహనం విభాగంలో బలమైన డిమాండ్ ఉండడంతో అమ్మకాలు పెరిగినట్లుగా చెప్పింది. నివేదిక ప్రకారం.. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన ఆర్థిక కార్యకలాపాలు, పండుగలకు కాలానుగుణ డిమాండ్ కంపెనీ పనితీరును బలోపేతం చేశాయి. అయితే, మీడియం, హెవీ ట్రక్-బస్సు విభాగం 1.5 శాతం పడిపోయాయి. కార్గో, ప్యాసింజర్ విభాగాల్లో డిమాండ్ పెరగడంతో అక్టోబర్‌లో ఎస్ఎంఎల్ ఇసుజు 32.2 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేసింది. అశోక్ లేలాండ్ అమ్మకాలు కూడా 16.4 శాతం పెరిగాయి.ఎంఅండ్‌హెచ్‌సీవీ విభాగం 15.5 శాతం, ఎల్‌సీవీ విభాగం 17.8 శాతం వృద్ధి చెందాయి. పండుగ డిమాండ్, రోడ్డు నిర్మాణ కార్యకలాపాలు పెరగడం, గత సంవత్సరం నుంచి బలహీనమైన బేస్ ఎఫెక్ట్ కంపెనీ వృద్ధిని పెంచాయి. ఎగుమతులు కూడా 21.2 శాతం పెరిగాయి.

ఇక ఐషర్ మోటార్స్ వీఈసీవీ విభాగం అక్టోబర్‌లో 13.2 శాతం పెరిగాయి. ఇది గత సంవత్సరం తర్వాత గణనీయంగా అమ్మకాలు పెరిగాయి. దేశీయ అమ్మకాలు 6.9 శాతం పెరగ్గా.. ఎగుమతులు రికార్డు స్థాయిలో 133.7 శాతానికి దూసుకెళ్లాయి. తేలికపాటి, మధ్యస్థ డ్యూటీ ట్రక్, బస్సుల విభాగాల్లో డిమాండ్ పెరుగుతూనే ఉంది. అక్టోబర్ పనితీరు వాణిజ్య వాహన పరిశ్రమ కోలుకోవడానికి నిదర్శనమని నివేదిక పేర్కొంది. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో పెట్టుబడులు, పెరిగిన సరుకు రవాణా, సెలవులకు కాలానుగుణ డిమాండ్ ఈ రంగాన్ని ఉత్తేజ పరిచాయని నివేదిక తెలిపింది. రాబోయే నెలల్లో కూడా ఇదే ఊపు కొనసాగే అవకాశం ఉందని పరిశ్రమ నిపుణులు అంచనా వేస్తున్నారు.

## విదేశీ మార్కెట్ల సంకేతాలతో డీలా

**రూ.2.71 లక్షల కోట్లు తగ్గిన సంపద విలువ**

**ఎఫ్ఐఐ విక్రయాలు.. రూ.1067.01 కోట్లు**

**డీఐఐ కొనుగోళ్లు.. రూ.1202.90 కోట్లు**



**ముంబై:** అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాల ప్రభావంతో మన స్టాక్ మార్కెట్ నష్టాల్లో ముగిసింది. విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్ల (ఎఫ్ఐఐ) అమ్మకాలు ప్రభావం చూపాయి. ఐటీ, లోహ, విద్యుత్ రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 7 పైసలు పుంజుకుని రూ.88.70 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 1.2% నష్టంతో 64.10 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.71 లక్షల కోట్లు తగ్గి రూ.469.80 లక్షల కోట్ల (5.30 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

స్వల్ప లాభంతో మొదలై..: బీఎస్ఈ సెన్సెక్స్ (క్రితం ముగింపు 83,978.49) స్వల్ప లాభంతో 84,000.64 పాయింట్ల వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత నష్టాల్లోకి జారుకుని, చివర వరకు అదే ఒరవడిని కొనసాగించింది. ఒక దశలో 83,412.77 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసినా, చివరకు 519.34 పాయింట్ల నష్టంతో 83,459.15 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 165.70 పాయింట్లు కోల్పోయి 25,597.65 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,578.40 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని, 25,787.40 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని నమోదు చేసింది.

రాణించిన టైటన్, ఎయిర్‌టెల్: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 5 షేర్లు మినహా మిగతావి నష్టాల్లో ముగిశాయి. పవర్‌గ్రిడ్ 3.13%, ఎటర్నల్ 2.79%, టీఎంపీవీ 2.53%, టాటా స్టీల్ 1.86%, మారుతీ సుజుకీ 1.76%, భెల్ 1.69%, ఎల్‌అండ్‌టీ 1.48% చొప్పున తగ్గాయి. జులై- సెప్టెంబరులో ఆకర్షణీయ ఫలితాలు నమోదు చేసిన టైటన్ షేరు 2.28%, భారతీ ఎయిర్‌టెల్ షేరు 1.8% పెరిగాయి. బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా, ఎస్‌బీఐ షేర్లు కూడా లాభపడ్డాయి. ఏబీ ఫైనాన్స్‌లో 100%, త్రి ఫాల్కన్స్ నోట్టింగ్ హిల్‌లో 50%, జావాఫైల్ హాస్పిటాలిటీలో 49%, లెవో బ్యూటీలో 49%, నిర్వానా గ్రాండ్ గోల్ఫ్ డెవలపర్స్‌లో 49% చొప్పున వాటాలను కొనుగోలు చేసేందుకు ఈజ్‌మైట్రిప్ ఒప్పందాలను కుదుర్చుకుంది.

## భారత్‌లో టెస్లా కొత్త అధిపతిగా శరద్ అగర్వాల్




**న్యూఢిల్లీ:** అమెరికాకు చెందిన ఎలక్ట్రిక్ వాహన దిగ్గజ సంస్థ టెస్లా భారత కార్యకలాపాలకు కొత్త అధిపతిని నియమించింది. లంబోర్గినీ ఇండియా కంపెనీ మాజీ హెడ్ శరద్ అగర్వాల్‌ను టెస్లా ఇండియా హెడ్‌గా నియమించినట్లు సమాచారం. భారత మార్కెట్లో తన ఉనికిని మరింత బలపరుచుకునేందుకు టెస్లా ప్రయత్నిస్తున్న దశలో ఈ నియామకం జరిగినట్టు తెలుస్తోంది.

లంబోర్గినీ తర్వాత శరద్ అగర్వాల్ మహీంద్రా మహీంద్రా యూనిట్ క్లాసిక్ లెజెండ్స్‌లో చీఫ్ బిజినెస్ ఆఫీసర్‌గా పనిచేశారు. మరోవైపు టెస్లా ఈ ఏడాది జులైలో ముంబయిలో తొలి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. ఆగస్టులో దిల్లీ ఏరోసిటీలో రెండో సెంటర్‌ను ప్రారంభించింది. జులైలో పరిచయం చేసిన మోడల్ వై కార్ల డెలివరీలను కూడా కంపెనీ ఇప్పటికే ప్రారంభించింది. ఈ నేపథ్యంలో భారత్‌లో తన కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు ఇండియా హెడ్‌ను నియమించింది.

## ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్.. నెంబర్ వన్ ర్యాంకుల్లో

# అభిషేక్ శర్మ, వరుణ్ చక్రవర్తి..!




**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా టీ20 ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. టీమిండియా యువ బ్యాటర్స్ అభిషేక్ శర్మ నెంబర్ వన్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. ఈ ఎడమచేతి వాటం బౌలర్ ఆసియా కప్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన విషయం తెలిసిందే. ఆస్ట్రేలియాతో జరుగుతున్న టీ20 సిరీస్‌లోనూ తనదైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. దాంతో నెంబర్ వన్ బ్యాటర్‌గా తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. మరో టీమిండియా ఆటగాడు తిలక్ వర్మ మూడోస్థానంలో ఉన్నాడు. భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఎనిమిదో స్థానంలో ఉన్నాడు. రెండోస్థానంలో ఇంగ్లండ్ ప్లేయర్ ఫిల్ సాల్ట్, నాలుగో స్థానంలో నిస్సంక (శ్రీలంక), నాలుగో స్థానంలో జోస్ బట్లర్ (ఇంగ్లండ్), ఆరోస్థానంలో ట్రావిస్ హెడ్ (ఆస్ట్రేలియా), ఏడోస్థానంలో టిమ్ సీఫెర్ట్ (న్యూజిలాండ్), తొమ్మిద స్థానంలో కుషాల్ పెరీరా (శ్రీలంక), పదో స్థానంలో మిచేల్ మార్ష్ (ఆస్ట్రేలియా) ఉన్నారు.

దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లో విజయం తర్వాత పాక్ బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్ మెరుగయ్యాయి. కెప్టెన్ బాబార్ ఆజం తొమ్మిదిస్థానాలు మెరుగుపరుచుకొని 30వ స్థానానికి చేరుకున్నాడు. సైమ్ అయూబ్, సల్మాన్ ఆఘా పదిస్థానాలు ఎగబాకి 39, 54 స్థానాలకు చేరారు. వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హెూప్ 12వ స్థానానికి, బంగ్లాదేశ్‌కు చెందిన టాంజిద్ హసన్ 17వ స్థానానికి, ఆఫ్ఘనిస్తాన్ ద్వయం రహ్మానుల్లా గుర్బాజ్, ఇబ్రహీం జద్రాన్ వరుసగా 15, 20వ స్థానాల్లో ఉన్నారు. ఇక టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి అగ్రస్థానాన్ని నిలుపుకోగా.. ఆస్ట్రేలియాకు చెందిన జోష్ హేజిల్‌వుడ్ రెండుస్థానాలు మెరుగుపరుచుకొని 10వ స్థానానికి చేరాడు. బంగ్లాదేశ్‌కు చెందిన ముజీబ్ ఉర్ రెహమాన్, మహేది హసన్ 14, 17వ స్థానానికి చేరుకున్నారు. వెస్టిండీస్‌కు చెందిన జాసన్ హెూల్డర్, రోస్టన్ చేజ్ 23, 38వ స్థానానికి చేరుకున్నారు.

పాక్‌తో జరిగిన సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన దక్షిణాఫ్రికా బౌలర్ కార్బిన్ బాష్ 15 స్థానాలు ఎగబాకి 38వ స్థానానికి చేరుకున్నాడు. టీమిండియా మరో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఐదు ర్యాంకులు దిగజారి 15వ స్థానానికి పడిపోయాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో పాక్ ఆటగాడు ఆయుబ్ నెంబర్ వన్‌గా కొనసాగుతున్నాడు. జింబాబ్వే ప్లేయర్స్ సికందర్ రజా, వెస్టిండిస్ ప్లేయర్ రోస్టన్ చేజ్ వరుసగా రెండు, మూడో స్థానాలకు చేరుకున్నారు. టీ20ల్లో రజా 33 బంతుల్లో చేసిన సెంచరీతో ర్యాంకింగ్స్‌ను గణనీయంగా మెరుగుపరుచుకున్నాడు. టీమిండియా ఆల్‌రౌండర్ హర్దిక్ పాండ్యా రెండు ర్యాంకులు దిగజారి నాలుగో స్థానానికి చేరుకున్నాడు. అలాగే, అక్సర్ పటేల్ నాలుగు ర్యాంకులు దిగజారి 170 పాయింట్లతో 15వ స్థానానికి చేరాడు. అభిషేక్ శర్మ 16వ స్థానంలో ఉన్నాడు.

### తనను ఎందుకు పక్కన పెట్టామో

## అర్ష్‌దీప్ సింగ్ అర్థం చేసుకున్నాడు

**కోచ్ మోర్నీ మోర్కెల్**

**అర్ష్‌దీప్ సింగ్ చాలా అనుభవం కలిగిన ఆటగాడని కితాబు**

**జట్టుకు అతడి విలువ ఏమిటో తెలుసన్న మోర్నీ మోర్కెల్**

**వివిధ కాంబినేషన్లకు ప్రయత్నించామని, ఇది అతను చేసుకున్నాడని వ్యాఖ్య**



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాతో జరిగిన తొలి రెండు టీ20 మ్యాచ్‌లలో తనను తుది జట్టులోకి ఎందుకు తీసుకోలేదో పేసర్ అర్ష్‌దీప్ సింగ్ అర్థం చేసుకున్నాడని భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ తెలిపాడు. క్వీన్ లాండ్ వేదికగా ఆస్ట్రేలియా-భారత్ జట్ల మధ్య గురువారం నాలుగో టీ20 మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో మోర్నీ మోర్కెల్ మీడియా సమావేశంలో మాట్లాడాడు.

అర్ష్‌దీప్ సింగ్ ఎంతో అనుభవం కలిగిన ఆటగాడని, ప్రపంచస్థాయి బౌలర్ అని ఆయన ప్రశంసించాడు. పవర్‌ప్లేలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ అతడని తెలిపాడు. జట్టుకు అతడి విలువ ఏమిటో తమకు తెలుసని వ్యాఖ్యానించాడు. అయితే ఈ పర్యటనలో తాము వివిధ కాంబినేషన్లను ప్రయత్నించామని, ఇది అర్ష్‌దీప్ సింగ్ అర్థం చేసుకున్నాడని అన్నాడు.

జట్టు ఎంపిక అనేది కేవలం మేనేజ్‌మెంట్‌కు మాత్రమే పరిమితం కాదని, ఆటగాళ్లకు కూడా ఒక సవాలేనని ఆయన పేర్కొన్నాడు. టీ20 ప్రపంచ కప్ సమీపిస్తున్న తరుణంలో భిన్న కూర్పులకు ప్రయత్నిస్తున్నామని చెప్పాడు. దీనివల్ల ఆటగాళ్లు తమకు అవకాశం రాలేదని నిరుత్సాహపడే అవకాశం ఉంటుందని, కానీ మేనేజ్‌మెంట్ ఆలోచన మరో విధంగా ఉంటుందని ఆయన వెల్లడించాడు.

ఆటగాళ్లను మరింత శ్రమించేలా ప్రోత్సహిస్తామని, ఎప్పుడు అవకాశం వచ్చినా అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించేలా వారిని సన్నద్ధం చేస్తామని ఆయన అన్నాడు. ఒత్తిడి సమయాల్లో ఆటగాళ్లు ఎలా రాణిస్తారనేది పరీక్షిస్తున్నామని, వారి సామర్థ్యంపై తమకు నమ్మకం ఉందని, మ్యాచ్‌లను ఎలా గెలవాలనే దానిపై దృష్టి సారిస్తున్నామని మోర్కెల్ స్పష్టం చేశాడు.

## వరల్డ్ కప్ కోచ్‌కు ఘన స్వాగతం..




**న్యూఢిల్లీ:** ప్రపంచ కప్ కోసం 47 ఏళ్లుగా నిరీక్షిస్తున్న భారత మహిళల జట్టు కలను సాకారం చేశాడు కోచ్ అన్మోల్ మజుందార్ క్రికెటర్‌గా పెద్ద రికార్డులేమీ సాధించని అతడు హర్మన్‌ప్రీత్ కౌర్ బృందాన్ని ఛాంపియన్లుగా మలిచిన తీరును వేనోళ్ల కొనియాడుతున్నారు క్రీడా ప్రముఖులు. దశాబ్దాలుగా అందకుండా ఊరిస్తున్న మెగా ట్రోఫీని పట్టేయడంలో కీలకమైన మజుందార్‌పై సర్వత్రా ప్రశంసలు కురుస్తున్నాయి. భారత జట్టు గొప్ప కోచ్‌లలో ఒకడిగా ఆయన పేరు దేశమంతా మార్మోగిపోతోంది. ఆయన కంటపడితే చాలు అభినందనల్లో ముంచెత్తుతున్నారు ఫ్యాన్స్. మహిళల జట్టు చరిత్ర సృష్టించడంలో కీలకమైన మజుందార్‌కు అతడి నివాసం వద్ద ఘన స్వాగతం లభించింది.

హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని టీమిండియాను వరల్డ్ కప్ ముద్దాడేలా చేసిన కోచ్ మజుందార్‌కు ఇరుగుపొరుగు వాళ్లు వినూత్నంగా స్వాగతం పలికారు. విల్లే పార్లేలోని తన నివాసానికి మంగళవారం ఆయన వెళ్లగానే.. స్థానికులు అభినందల్లో ముంచెత్తారు. బ్యాండ్ బాజాలతో.. గులాబా రెమ్మలతో మజుందార్‌కు స్వాగతం పలికారు. కొందరు బ్యాట్లు చేతబూని అచ్చం క్రికెట్ మైదానంలో మాదిరిగా గార్డ్ ఆఫ్ హానర్‌తో ఆయనకు మర్చిపోలేని విధంగా వెల్‌కమ్ చెప్పారు. తనపై వాళ్లు చూపిస్తున్న ప్రేమాభిమానాలకు సంబురపడిపోయిన మజుందార్.. కూల్‌గా నడుచుకుంటూ తన ఇంటికి వెళ్లారు. ప్రస్తుతం ఆ వీడియో నెట్టింట వైరలవుతోంది.

ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు

క్రికెటర్‌గా జాతీయ జట్టు తరఫున ఒక్క మ్యాచ్ కూడా ఆడని మజుందార్ కోచ్‌గా టీమిండియాను విశ్వ విజేతగా నిలిపాడు. రెండేళ్ల క్రితం బాధ్యతలు చేపట్టిన అతడు జట్టులో నిలకడ, స్థిరత్వం.. విజయకాంక్ష వంటి లక్షణాలను రగిల్చాడు. కెప్టెన్ హర్మన్‌తో కలిసి ప్రతిభావంతులకు ప్రాధాన్యమిచ్చిన ఆయన.. వరల్డ్ కప్‌లో తన మార్క్ చూపించాడు. రెండు విజయాల తర్వాత వరుసగా మూడు పరాజయాలు ఎదురైన వేళ 'అధైర్యపడొద్దని.. సొంతగడ్డపై కప్‌ను గెలిచే సత్తా మీకుంద'ని

### బంగ్లా కెప్టెన్‌పై ఆరోపణలను

# కొట్టిపారేసిన క్రికెట్ బోర్డు

**బంగ్లా మహిళా క్రికెట్ కెప్టెన్‌పై మాజీ పేసర్ సంచలన ఆరోపణలు**

**జూనియర్ ప్లేయర్లను కెప్టెన్ నిగర్ సుల్తానా కొడుతోందన్న జహనారా ఆలం**

**ప్రపంచకప్, దుబాయ్ టూర్‌లలోనూ ఈ ఘటనలు జరిగాయని ఆరోపణ**

**జహనారా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు**

**ఆరోపణలు నిరాధారం, కల్పితం అంటూ బీసీబీ అధికారిక ప్రకటన**

**కెప్టెన్, జట్టు యాజమాన్యానికి పూర్తి మద్దతు ప్రకటించిన బోర్డు**



**ఢాకా:** బంగ్లాదేశ్ మహిళల క్రికెట్ జట్టులో తీవ్ర దుమారం చెలరేగింది. జట్టు కెప్టెన్ నిగర్ సుల్తానా జోటీ... జట్టులోని జూనియర్ క్రికెటర్లపై భౌతిక దాడులకు పాల్పడుతోందంటూ సీనియర్ ఫాస్ట్ బౌలర్ జహనారా ఆలం చేసిన సంచలన ఆరోపణలను బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) తీవ్రంగా ఖండించింది. ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, కల్పితమని, వాటిలో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేసింది. జట్టులో ఐక్యతతో ముందుకు సాగుతున్న తరుణంలో ఇలాంటి నిందలు వేయడం దురదృష్టకరమని పేర్కొంది.

జట్టులో చోటు కోల్పోయి దూరంగా ఉంటున్న సీనియర్ పేసర్ జహనారా ఆలం, బంగ్లాదేశ్‌కు చెందిన ఓ ప్రముఖ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేసింది. "కెప్టెన్ నిగర్ సుల్తానా జూనియర్లను తరచూ కొడుతుంది. ఇది కొత్తేమీ కాదు. ఇటీవల ముగిసిన ప్రపంచకప్ సమయంలో కూడా కొందరు జూనియర్లు నాతో మాట్లాడుతూ.. 'లేదు, నేను మళ్లీ ఆ తప్పు చేయను. చేస్తే మళ్లీ చెంపదెబ్బ తినాల్సి వస్తుంది' అని చెప్పారు. నిన్న కూడా దెబ్బలు తిన్నానని కొందరు నాతో చెప్పడం నేను విన్నాను" అని జహనారా పేర్కొంది.

ఆమె అంతటితో ఆగకుండా, "గతంలో దుబాయ్ పర్యటనలో ఉన్నప్పుడు కూడా ఒక జూనియర్ ప్లేయర్‌ను రూమ్‌కు పిలిచి మరీ చెంపపై కొట్టింది" అని తీవ్రమైన ఆరోపణలు చేసింది. జట్టులో నెలకొన్న రాజకీయాల వల్లే ఆటగాళ్లు ఇబ్బందులు పడుతున్నారని ఆమె వాపోయింది. డిసెంబర్ 2024లో ఐర్లాండ్‌తో చివరి మ్యాచ్ ఆడిన జహనారా, ఆ తర్వాత జట్టులో స్థానం కోల్పోయింది. మానసిక ఆరోగ్య కారణాలతో కొంతకాలం క్రితం విరామం కోరడమే కాకుండా, సెంట్రల్ కాంట్రాక్టుల నుంచి కూడా తనను తప్పించాలని కోరింది.

**తీవ్రంగా ఖండించిన బీసీబీ**

జహనారా ఆలం చేసిన వ్యాఖ్యలపై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు వెంటనే స్పందించింది. ఒక అధికారిక ప్రకటన విడుదల చేస్తూ ఈ ఆరోపణలను పూర్తిగా తోసిపుచ్చింది. "మహిళల జాతీయ జట్టు మాజీ సభ్యురాలు మీడియాలో చేసిన వ్యాఖ్యలను బీసీబీ పరిగణనలోకి తీసుకుంది.



# టాలీవుడ్‌ను చూసి బాలీవుడ్ ఎంతో మారాలి సోనాక్షి సిన్హా



టాకీస్: బాలీవుడ్ ప్రముఖ నటి సోనాక్షి సిన్హా 'జటాధర' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను పలకరించనున్నారు. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఆమె టాలీవుడ్, బాలీవుడ్ చిత్ర పరిశ్రమల పనివిధానాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దక్షిణాది పరిశ్రమలో ఉండే సమయపాలన, క్రమశిక్షణను ప్రశంసించిన ఆమె, ఈ విషయంలో బాలీవుడ్ చాలా నేర్చుకోవాలని సూచించారు. ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ, "నేను గతంలో తమిళ, హిందీ భాషల్లో సినిమాలు చేశాను. ఇప్పుడు తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తున్నాను. దక్షిణాది సినీ పరిశ్రమలో కొన్ని విషయాలు నాకు బాగా నచ్చాయి, ముఖ్యంగా ఇక్కడి సమయపాలన అద్భుతం. టాలీవుడ్‌లో ఉదయం 9 గంటలకు షూటింగ్ మొదలైతే సాయంత్రం 6 గంటల కల్లా కచ్చితంగా పూర్తిచేస్తారు. దీనికి ఎంతో క్రమశిక్షణ అవసరం. కానీ హిందీ పరిశ్రమలో ఇలాంటి వాతావరణం ఉండదు. అక్కడ సమయపాలన పాటించరు, అర్ధరాత్రి వరకు షూటింగ్‌లు జరుగుతూనే ఉంటాయి. ఆ పద్ధతి నాకు అస్సలు నచ్చదు. ఈ విషయంలో టాలీవుడ్‌ను చూసి హిందీ వాళ్లు మారాలని కోరుకుంటున్నాను" అని సోనాక్షి సిన్హా స్పష్టం చేశారు. గతంలో ప్రాంతీయ భాషా చిత్రాల్లో నటించాలని ఆసక్తి ఉన్నప్పటికీ, డేట్లు సర్దుబాటు కాకపోవడం వల్లే కుదరలేదని ఆమె గుర్తుచేసుకున్నారు. ఇక 'జటాధర' విషయానికొస్తే, ఈ చిత్రంలో నవ దళపతి సుధీర్ బాబు హీరోగా నటిస్తున్నారు. పాన్-ఇండియా ద్విభాషా చిత్రంగా తెరకెక్కిన ఈ సినిమాకు వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పణలో ఉమేశ్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్ తదితరులు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా నవంబర్ 7న థియేటర్లలో విడుదల కానుంది.

# పెద్దిలో చికిరి చికిరి స్టెప్పులు

**టాకీస్:** రామ్ చరణ్ బుచ్చిబాబు సానా కాంబోలో వస్తున్న పెద్ది సినిమాపై ప్రపంచ వ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్న విషయం తెలిసిందే. జాన్వీ కథానాయిక కాగా ఆస్కార్ విన్నర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నాడు. అయితే.. ఈ సినిమా నుంచి అప్డేట్ ఎప్పుడు వస్తుందా అని మెగా అభిమానులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే వచ్చిన ఫస్ట్ షాట్ వీడియో ప్రపంచ వ్యాప్తంగా తెగ వైరల్ అయింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శర వేగంగా జరుగుతుండగా ఇటీవలే శ్రీలంకలో ఓ పాట సైతం చిత్రీకరణ పూర్తి చేసుకుని టీం తిరిగి వచ్చింది. వచ్చే మార్చిలో ఈ మూవీ ప్రేక్షకులకు ఎదుటకు రానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ చిత్రం నుంచి ఒక్కొక్కటిగా అప్డేట్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. తాజాగా ఈ సినిమా నుంచి పాట రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించిన డైరెక్టర్ బుచ్చి బాబు సానా పాటకు సంబంధించి బుధవారం చిన్న గ్లిమ్స్ రిలీజ్ చేసి నవంబర్ 7, శుక్రవారం రోజున పూర్తి పాటను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఇందుకోసం బుచ్చిబాబు ఏకంగా ఈ సినిమా సంగీత దర్శకుడు రెహమాన్‌నే రంగంలోకి దింపాడు. ఆయనతో తన ఫస్ట్ ఇంటరాక్షన్ గురించి వివరించి చివరకు ఈ సినిమా సాంగ్ సిట్యువేషన్ చెప్పి ఓ ట్యూన్ అడగడం అయన వెంటనే చికిరి చికిరి అంటూ ఓ ట్యూన్ ఇవ్వడం అంతా చకచకా జరిగిపోయినట్లు చూపించారు. చివర్లో పాట ట్యూన్‌కు తగ్గట్టు రామ్‌చరణ్ వేసిన స్టెప్స్ ను సైతం చూపించి ఒక్కసారిగా పాటపై హైప్ పెంచేశారు. ఈ వీడియో బయటకు వచ్చిన క్షణాల్లోనే రామ్ చరణ్ హుక్ స్టెప్ సోషల్ మీడియాను కమ్మేసింది. రామ్ చరణ్ , మెగా అభిమానులే కాక చాలామంది నెటిజన్లు సైతం ఈ వీడియోకు, ఆ స్టెప్పులకు ఫిదా అవుతున్నారు. రానున్న నెలరోజులు ఈ పాట ఇంటర్నెట్‌ను షేక్ చేస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఎక్కడ చూసినా రామ్ చరణ్ స్టెప్పులే దర్శనమివడం గ్యారంటీ.

## సుధీర్ బాబు 'జటాధర' నుంచి కొత్త ట్రైలర్




**టాకీస్:** నటుడు సుధీర్ బాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'జటాధర'. ఈ సినిమాకు వెంకట్ కళ్యాణ్ అభిషేక్ జైస్వాల్ సంయుక్తంగా దర్శకత్వం వహిస్తుండగా.. వెంకట్ కళ్యాణ్ కథనందిస్తున్నాడు. తెలుగు, హిందీ బైలింగ్యువల్ ప్రాజెక్ట్‌గా ఈ సినిమా రాబోతుంది. ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ సోనాక్షి సిన్హా కీలక పాత్రలో నటించబోతుంది. నవంబర్ 07న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ చిత్రం విడుదలకు సంబంధించిన అన్ని పనులను పూర్తి చేసుకుంటుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి టీజర్‌తో పాటు ట్రైలర్‌లను విడుదల చేసిన చిత్రయూనిట్ తాజాగా కొత్తగా రిలీజ్ ట్రైలర్‌ను వదిలింది. మైథాలాజికల్, సూపర్ న్యాచురల్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ ట్రైలర్ ప్రస్తుతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. రైన్ అంజలి, శిల్పా శిరోద్కర్ కీలక పాత్రల్లో నటిస్తుండగా.. జీ స్టూడియో సమర్పణలో ఉమేశ్ కె.ఆర్.భన్సాల్, ప్రేరణ అరోరా సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

## గర్ల్‌ఫ్రెండ్ మూవీ సంతృప్తిని ఇచ్చే సినిమా

### నిర్మాత అల్లు అరవింద్ కామెంట్స్



టాకీస్: రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో, రష్మిక మందన్నా ప్రధాన పాత్రలో రూపొందిన 'ది గర్ల్‌ఫ్రెండ్' ఈనెల 7న విడుదల కానుంది. అల్లు అరవింద్ గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై వస్తున్న ఈ చిత్రం ట్రైలర్ నుంచి మంచి హైప్ క్రియేట్ చేయడంతో సినిమాపై ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. సినిమా విడుదలకు మరో రెండు రోజుల సమయం మాత్రమే ఉన్న నేపథ్యంలో తాజాగా బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా.. అల్లు అరవింద్ మాట్లాడుతూ.. పలు ఆసక్తికర అంశాలు పంచుకున్నారు. నేను చాలా సినిమాలు తీశాను, డబ్బులు సంపాదించాను. కానీ 'ది గర్ల్‌ఫ్రెండ్' మాత్రం తృప్తికోసం తీశాను అంటూ వ్యాఖ్యానించారు. 2021లో ఈ కథ విన్నప్పటి నుంచి సినిమా తీయాలని ఎదురుచూశాను. సమాజానికి బోల్డ్‌గా కొన్ని విషయాలు చెప్పాలనిపించింది. అందుకే ఈ సినిమా చేశాము. ఇది చాలా సున్నితమైన సబ్జెక్ట్. ప్రతి యువకుడు, యువతి తప్పకుండా చూడాల్సిన సినిమా ఇదని అన్నారు. ఇందులో ఎన్ని పాటలు ఉన్నాయి, ఎన్ని ఫైటింగ్‌లు ఉన్నాయి, ఏం పంచ్‌లు ఉన్నాయనేది ఈ సినిమాకు వర్తించదని, 'మన ఇంట్లో ఆడవాళ్ల మనస్సుల్లో ఏమి కోరికలు, భావోద్వేగాలు ఉంటాయో ఈ సినిమా చూపిస్తుంది. కథ అతి సున్నితంగా మొదలై, అతి ఘాటుగా ముగుస్తుంది. చూసిన వారు ఈ సినిమాను మర్చిపోలేరు? ఈ కథ వెంటాడుతుంది. 'ది గర్ల్‌ఫ్రెండ్' కి తక్కువ రేటింగ్ ఇవ్వలేరు అంత సంతృప్తికరంగా ఉంటుంది సినిమా అని స్పష్టం చేశారు.



## అనగనగా ఒక రాజులో పాట పాడిన నవీన్

**టాకీస్:** మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమా తర్వాత జాతి రత్నాలు ఫేం నవీన్ పొలిశెట్టి నటిస్తోన్న చిత్రం అనగనగా ఒక రాజు. ఈ మూవీ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన ప్రీ వెడ్డింగ్ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఈ సినిమాను జనవరి 14న సంక్రాంతి కానుకగా విడుదల చేయనున్నారు. మ్యాడ్ ఫేం కళ్యాణ్ శంకర్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయాల్సి ఉండగా.. మారి చేతుల్లోకి వెళ్లింది. ఈ సినిమా కోసం నవీన్ పొలిశెట్టి సింగర్‌గా మారిపోయాడన్న వార్త మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేస్తుంది. తాజా సమాచారం ప్రకారం నవీన్ పొలిశెట్టి పాడిన ఈ పాట నవంబర్ మూడో వారంలో లాంచ్ కానుంది. ఇప్పటిదాకా విడుదల చేసిన ప్రమోషనల్ కంటెంట్ కామిక్ టచ్‌తో సాగుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. ఇప్పటికే లాంచ్ చేసిన పోస్టర్‌లో నవీన్ పొలిశెట్టి లుంగీ, బనియన్ వేసుకుని, మెడలో రుమాలు వేసుకొని రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకుపై వెళ్తూ క్యూరియాసిటీ పెంచుతున్నాడు. సితార ఎంటర్‌టైన్ మెంట్స్ నిర్మిస్తున్న ఈ మూవీలో ఈ చిత్రంలో మీనాక్షిచౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో వస్తోన్న ఈ చిత్రాన్ని ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ కో ప్రొడ్యూస్ చేస్తుంది. ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. రాజుగారి పెళ్లి విందులో చమ్మక్ చంద్ర అరేయ్ ఇది రాజుగారి పెళ్లి.. గెస్టులందరికీ గోల్డ్ ప్లేట్స్ మాత్రమే పెట్టండి.. అంటూ చెప్పే డైలాగ్స్‌తో మొదలైంది ప్రీ వెడ్డింగ్ వీడియో. అతిథుల్లో ఓ వ్యక్తి ఏంటండి వీళ్లు ప్లేటు గోల్డ్.. స్వీటు గోల్డ్ అంటున్నారు.. ఇదేమైనా మలబార్ గోల్డ్ వాళ్ల పెళ్లా అని అడుగుతుంటే.. మరో వ్యక్తి ఏవండి ఇది మా రాజుగారి పెళ్లండి అని అంటున్నాడు. నవీన్ పొలిశెట్టి ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ వెడ్డింగ్ క్యాసెట్ చూస్తూ.. ముఖేశ్ అంబానీకి ఫోన్ చేసి.. ముఖేశ్ మామయ్యా ఈవెంట్‌కు వచ్చిన సెలబ్రిటీల ఫోన్ నంబర్లు పెట్టు చెబుతా.. ఈ ఇయర్ అంతా అంబానీ పెళ్లి.. వచ్చే ఏడాదంతా రాజుగారి పెళ్లి అంటున్నాడు. జాతి రత్నాలు హీరో స్టైల్ ఆఫ్ హ్యూమర్ టచ్‌తో సాగుతున్న వీడియో సినిమాపై హైప్ క్రియేట్ చేస్తోంది.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.